Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 319 మేడ్చల్ మల్కాజ్‌గిరి 8 డిసెంబర్ 2023 శుక్రవారం పేజీలు : 4

## తుపాను బాధితులకు ఆపన్న హస్తం..

### ఆదుకున్న భారత వైమానిక దళం

చెన్నై: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో వణుకుతున్న చెన్నై నగరానికి భారత వైమానిక దళంఆపన్నహస్తం అందించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎయిర్ డ్రాప్ 2,300 కిలోల సహాయ సామగ్రిని పంపిణీ చేసింది. ఐఏఎఫ్ తో కలిసి తమిళనాడు ప్రభుత్వ విపత్తు నిర్వహణ శాఖలు పని చేస్తున్నాయి. రాష్ట్రంలోని వివిధ ఏజెన్సీలు సహాయక సామగ్రిని అందిస్తున్నాయి. IAFకి చెందిన నాలుగు చేతక్ హెలికాప్టర్లు దక్షిణ చెన్నైలో మెదవాక్కం నుండి పుజుడివాక్కం మెట్రో స్టేషన్ వరకు 8 ప్రదేశాలను కవర్ చేశాయి. ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్స్ చేతక్ హెలికాప్టర్లలో అధికారులు చెన్నైలోని వెస్ట్ తాంబరం, ముడిచూర్, వెలచ్చేరి, పల్లికరణై ప్రాంతాల్లో సహాయక సామగ్రిని పంపిణీ చేశారు. పల్లికరణై, తోరైపాక్కం ప్రాంతాల్లో కూడా సహాయక చర్యలు చేపట్టారు.

# బాహుబలి సీన్ రిపీట్!

# దద్దరిల్లిన ఎల్బీ స్టేడియం




# అట్టహాసంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం





హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా అనుమల రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సమయంలో ఆయనతోపాటు డిప్యూటీ సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకారం చేశారు. వీరందరితోనూ గవర్నర్ తమిళ సై సౌందరరాజన్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అభిమానులు "బాహుబలి" సినిమాను గుర్తుకు తెచ్చుకోవడం గమనార్హం. అవును... బాహుబలి సినిమాలో శివగామి దేవిగా సోనియా గాంధీ సభావేదికపై ఆసీనురాలవ్వగా.. బాహుబలి ప్రభాస్ స్థాయిలో అనుమల రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. దీంతో దీనికి సంబంధించిన వీడియోను బాహుబలి సినిమాతో కంపేర్ చేస్తూ అభిమానులు నెట్టింట వైరల్ చేస్తున్నారు. ఈ సందర్భంగా రేవంత్ ప్రసంగం ఈ కార్యక్రమంలో మరో భారీ హైలెట్ అయ్యింది. ఇలా ప్రమాణస్వీకారం అనంతరం మైకందుకున్న తెలంగాణ నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... అశేష జనవాహిని అభినందనల నడుమ ప్రసంగం మొదలుపెట్టారు. ఇందులో భాగంగా... జై సోనియమ్మ, జై జై సోనియమ్మ అని ప్రసంగం మొదలుపెట్టడం గమనార్హం. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం గురించి కీలక వ్యాఖ్యలు చేశారు ఈ సమయంలో... సోనియా గాంధీ ఉక్కు సంకల్పం ఇందుకు కారణం అని అన్నారు. అయితే దశాబ్ద కాలంగా ఈ తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం దెబ్బతిందని... మానవహక్కులు హరించబడ్డాయని.. ప్రజలు చెప్పుకోవడానికి ప్రభుత్వంలో ఎవరూ లేక మౌనంగా భరించిన నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు తమ ఆలోచనను ఉక్కు సంకల్పంగా మార్చి, ఎన్నో త్యాగాలు చేసి, తమ రక్తాన్ని చెమటగా మార్చి ప్రజారాజ్యాన్ని స్థాపించారని అన్నారు. ఈ ప్రభుత్వ ఏర్పాటుతో తెలంగాణ నలుమూలలా సమానమైన అభివృద్ధి జరుగుతుందని, అందరికీ న్యాయం జరుగుతుందని రేవంత్ తెలిపారు. ఈ ప్రమాణస్వీకార సమయానికే ప్రగతి భవన్ ముందు నిర్మించిన ఇనుప కంచెను నిర్మించడం జరిగిందని రేవంత్ వెల్లడించారు. ఈ సందర్భంగా తెలంగాణ కుటుంబ సభ్యులైన ఎవరైనా ప్రగతి భవన్ లోకి ప్రవేశించి సమస్యలు చెప్పుకోవచ్చని అన్నారు! ఈ సందర్భంగా ఈ ప్రభుత్వంలోని వ్యక్తులు పాలకులు కాదు ప్రజలకు సేవకులు అని నిరూపించుకుంటామని రేవంత్ గట్టిగా చెప్పారు. ఇదే సమయంలో కార్యకర్తల కష్టాన్ని గుర్తుపెట్టుకుంటా అని రేవంత్ రెడ్డి తెలిపారు. రేపు ఉదయం 10 గంటలకు ప్రగతి భవన్ లో పూలే ప్రజాదర్బార్ నెలకొల్పుతామని అన్నారు. ఈ సందర్భంగా జై సోనియమ్మ అంటూ ప్రసంగాన్ని ముగించారు.




## శుక్రవారం ప్రజాదర్బార్.. సీఎంగా రేవంత్ తొలి ప్రసంగం ఇదే

హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు ఇవాళే స్వేచ్ఛ లభించిందని.. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకే ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎల్బీ స్టేడియంలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ప్రజలను ఉద్దేశించి తొలిసారి ఆయన మాట్లాడారు. "ప్రజా ప్రభుత్వం ఏర్పాటుతో ఇక అంతటా సమానాభివృద్ధి సాధ్యం. తెలంగాణ ఆషామాషీగా ఏర్పడిన రాష్ట్రం కాదు. పోరాటాలతో త్యాగాలే పునాదులుగా ఏర్పడిన రాష్ట్రం తెలంగాణ. పదేళ్లుగా నిరంకుశత్వాన్ని రాష్ట్ర ప్రజలు మౌనంగా భరించారు. ఇప్పటికే ప్రగతిభవన్ ముందు ఉన్న ఇనుప కంచెలను బద్దలు కొట్టించాం. సంక్షేమం, అభివృద్ధి రాష్ట్రంగా తెలంగాణను తీర్చుదిద్దుతాం. శుక్రవారం ఉదయం 10 గంటలకు జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తాం. మీ బిడ్డగా.. మీ సోదరుడిగా మీ బాధ్యతలను నేను నిర్వహిస్తా. మేం పాలకులం కాదు.. మీ సేవకులం. కార్యకర్తల కష్టాన్ని, శ్రమను గుర్తుపెట్టుకుంటా. పదేళ్లుగా కష్టపడిన కార్యకర్తలను గుండెల్లో పెట్టి చూసుకుంటా. విద్యార్థి, నిరుద్యోగ, అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేస్తా" అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.




**డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క ప్రమాణం** : తెలంగాణ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణం చేశారు. ఎల్బీ స్టేడియంలో రేవంత్‌తో గవర్నర్ తమిళిసై ప్రమాణం చేయించారు. అనంతరం పలువురు మంత్రులతో కూడా గవర్నర్ ప్రమాణం చేయించారు. సీఎంగా రేవంత్ ప్రమాణం చేసిన తర్వాత ఉప ముఖ్యమంత్రిగా మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క ప్రమాణం చేశారు. **కొత్త మంత్రులకు ఏయే శాఖలు కేటాయించారంటే..** తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే ఆయనతో పాటూ 11మంది మంత్రులు కూడా ప్రమాణం చేశారు. మంత్రులందరికీ సీఎం రేవంత్ రెడ్డి.. శాఖాలను కేటాయించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డికి హెూమ్ శాఖ కేటాయించారు. అలాగే మల్లు బట్టి విక్రమార్కకు రెవెన్యూ, కోమటిరెడ్డి వెంటకరెడ్డికి పురపాలక శాఖ, తుమ్మల నాగేశ్వరరావుకు రోడ్లు, భవనాలు, పొంగులేటి శ్రీనివాస రెడ్డికి ఇరిగేషన్ శాఖ, శ్రీధర్ బాబుకు ఆర్థిక శాఖ, సీతక్కకు గిరిజన సంక్షేమ శాఖ, జూపల్లి కృష్ణారావుకు పౌరసరఫాల శాఖ, పొన్నం ప్రభాకర్‌కు బీసీ సంక్షేమ శాఖ, కొండా సురేఖకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, దామోదర రాజనర్సింహకు ఆరోగ్య శాఖను కేటాయించారు. ఇదిలావుండగా.. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై తొలి సంతకం చేశారు. రెండవ సంతకం దివ్యాంగురాలు రజనీ ఉద్యోగ నియామక పత్రంపై చేశారు.

# తెలంగాణ ప్రజానీకాన్ని అబ్బురపర్చేలా...

# తొలి అడుగులు







## ప్రగతి భవన్ గేట్లు పగలగొట్టి.. రజనీకి ఉద్యోగమిచ్చి..!

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. అశేష అభిమానుల మధ్య, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల నడుమ పండుగలాంటి వాతావరణంలో సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు మరో 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. దొరల పాలన ముగిసిందనీ.. ప్రజా పాలన ప్రారంభమయిందనీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన వెంటనే వ్యాఖ్యానించిన రేవంత్.. ఆ దిశగానే అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది. గురువారం రేవంత్ ప్రమాణ స్వీకార కార్యక్రమం సందర్భంగా కనిపించిన రెండు దృశ్యాలు.. రేవంత్ పాలన విభిన్నంగా ఉండబోతోందని నిరూపిస్తోంది. ప్రమాణ స్వీకారం చేయడానికంటే ముందే ప్రగతి భవన్ ముందు ఏర్పాటు చేసిన ఎత్తయిన గ్రిల్స్‌ను, బారికేడ్స్‌ను తొలగించేలా రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ప్రగతి భవన్ ముందు రోడ్డు పక్కగా ఏర్పాటు చేసిన షెడ్‌ను కూడా తీసేయాలని సూచనలు చేశారు. సామాన్య ప్రజలు కూడా ప్రగతి భవన్‌లోకి వచ్చేలా వీలు ఉండాలన్నది రేవంత్ ఉద్దేశం. ఏదో కష్టం చెప్పుకుందామని ఎన్నో మైళ్ల దూరం ప్రయాణించి మరీ ప్రగతి భవన్ దాకా వచ్చే ప్రజలను.. ఇలా బారికేడ్స్, గ్రిల్స్ ఏర్పాటు చేసి అడ్డుకోవడం సమంజసం కాదన్నది రేవంత్ భావన. అందుకే.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ప్రగతి భవన్‌కు వచ్చేలోపే ఆ గ్రిల్స్, బారికేడ్స్ లాంటి వాటిని అధికారులు తీసేయిస్తున్నారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన్ను కలిసేందుకు ఈ గేట్ల వద్దే ప్రజలు పడిగాపులు కాసేవాళ్లనీ.. సీఎం అపాయింట్మెంట్ లేదంటూ ఎంతో మంది ఈ గేట్ల నుంచే తిరిగి వెనక్కు వెళ్లిన సందర్భాలు ఉన్నాయని కాంగ్రెస్ నేతలు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు రేవంత్ తీసుకున్న నిర్ణయంతో అలాంటి ఘటనలు మళ్లీ కనిపించబోవని తేల్చిచెబుతున్నారు. 'ఈ ఎన్నికల్లో మన పార్టీ గెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నీకే మొట్టమొదటి ఉద్యోగం ఇస్తాం' అంటూ రజనీ అనే మరుగుజ్జు యువతికి దాదాపు రెండు నెలల క్రితం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఆయన ఎన్నో సభల్లో మాట్లాడారు. ఎంతో బిజీబిజీగా గడిపారు. పార్టీని గెలిపించేందుకు విశ్రాంతి లేకుండా పనిచేశారు. అయినప్పటికీ ఆనాడు ఆ యువతికి ఇచ్చిన హామీని రేవంత్ గుర్తుంచుకున్నారు. 'నా వైకల్యమే నాకు శాపంగా మారింది. నాకున్న పరిమితుల కారణంగా ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత లేదంటున్నారు. పోనీ ప్రైవేటు ఉద్యోగం చేద్దామన్నా నన్ను ఎవరూ జాబ్ లోకి తీసుకోవడం లేదు. ఎంతో కష్టపడి పీజీ చదివాను. మంచి మార్కులు సంపాదించాను. ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉండాలనుకుంటే.. నేనే నా కుటుంబానికి భారంగా మారాను' అంటూ రజనీ అనే మరుగుజ్జు యువతి ఆవేదనకు రేవంత్ మనసు కరిగిపోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి ఉద్యోగం నీదేనంటూ రెండు నెలల క్రితమే రజనీకి ఆయన హామీ ఇచ్చారు. ఆనాడు ఇచ్చిన మాటను గుర్తు చేసుకుని మరీ రజనీని తన ప్రమాణ స్వీకారానికి రేవంత్ రెడ్డి పిలిపించారు.

ఆరు గ్యారెంటీలకు సంబంధించిన ఉత్తర్వులపై తొలి సంతకం చేసిన రేవంత్ రెడ్డి.. దివ్యాంగురాలు రజనీకి ఉద్యోగ నియామక పత్రంపై రెండో సంతకం చేశారు. అలా ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఆమెకు ఉద్యోగం ఇవ్వడంపై కాంగ్రెస్ కార్యకర్తల్లోనే కాదు.. అశేష తెలంగాణ జనంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# సంపాదకీయం

## జనసేన పొత్తుతో బీజేపీ అంతలా నష్టపోయిందా...

జనసేన అసలు తెలంగాణాలో ఎందుకు పోటీ చేసింది. ఇది పెద్ద ప్రశ్న. పోటీ చేయాలన్న ఆలోచన వస్తే రావచ్చు కానీ ఎక్కడా ఎపుడూ ఆ పార్టీతో పొత్తు పెట్టుకోని బీజేపీకి జనసేనను చేరదీయాలన్న ఆలోచన ఎలా వచ్చింది. ఇది కూడా మౌలికమైన ప్రశ్నగానే చూడాలి. ఈ పరిణామం వల్ల జనసేనకు ఏమీ ఒరిగింది లేదు. పైగా పరువు పోయింది. కానీ బీజేపీకి మాత్రం బిగ్ లాస్ అయింది అని అంటున్నారు. దీని మీద రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ విశ్లేషణ చూస్తే ఆలోచన పెంచేలా ఉంది. ఆయన ఏమంటున్నారు అంటే ఆ ఎనిమిది సీట్లు జనసేనకు ఇవ్వకపోతే బీజేపీ ఓటింగ్ పర్సెంటేజ్ ఇంకా పెరిగేది. ఆంధ్ర పార్టీలు టీడీపీ, వైసీపీ దూరంగా వుంటే అసలు జనసేన తెలంగాణాలో ఎందుకు పోటీ చేసిందో అర్ధం కాలేదు అని. నిజంగా కూకట్ పల్లి సీట్లో నలభై వేల దాకా జనసేన తెచ్చుకుంది. జనసేన అభ్యర్ధి ప్రేమ్ కుమార్ బీజేపీకి చెందిన వారే. అక్కడ జనసేన పోటీ చేసి ఉంటే గెలుపు దిశగా కూడా వచ్చి ఉండేవారేమో. లేదా ఓట్లు అంతకు డబల్ అయినా అవవచ్చు. అంతే కాదు మిగిలిన సీట్లలో కూడా అదే జరిగి ఉండేది అని అంటున్నారు. జనసేనకు వచ్చిన రెండు మూడు వేల కంటే పదింతలు అయినా బీజేపీ ఒక్కో సీట్లులో తెచ్చుకునేది అని కూడా అంటున్నారు. అపుడు బీజేపీకి మరింత బేస్ తెలంగాణాలో ఏర్పడేది అని ఒక విశ్లేషణ ఉంది. ఇప్పటికి మాత్రం బీజేపీ ఏమీ తక్కువ తినలేదు. ఏకంగా 36 లక్షల ఓట్లను తెచ్చుకుంది. ఇది చాలా మంచి నంబరే. పైగా ఉత్తర తెలంగాణాలో ఆ పార్టీ తన ఓటు బ్యాంక్ ని పెంచుకుంటూ పోతోంది. ఇది మంచి పరిణామంగానే కమలనాథులు చూస్తున్నారు. ఇక మరో వైపు చూస్తే ప్రధాని నరేంద్ర మోడీ సైతం ఈ ఫలితాల మీద ఒకింత సంతృప్తినే వ్యక్తం చేశారు. తాము అంతకంతకూ గ్రాఫ్ పెంచుకుని ఎదుగుతున్నామని కూడా అన్నారు. బీజేపీకి తాను అనుకున్నట్లుగా డబుల్ డిజిట్ నంబర్ లో సీట్లు సాధించకపోయినా బీఆర్ఎస్ ని ఓడిపోవడంతో ఒక మంచి చాన్స్ దక్కిందని అంటున్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ బీజేపీ జాతీయ పార్టీ. అలా రెండు జాతీయ పార్టీల మధ్య జరిగే ఫైట్ లో ఏదో నాటికి తమకు అధికారం తప్పకుండా దక్కుతుంది అని బీజేపీ వ్యూహకర్తలకు ఆశ ఉంది. ఇక జనసేనతో పొత్తు వల్ల నష్టం ఏమీ జరగలేదని తెలంగాణా బీజేపీ ప్రెసిడెంట్ జి కిషన్ రెడ్డి అంటున్నా ఆ పార్టీ ఫ్యూచర్ లో మాత్రం ఇంకా పకడ్బంధీగా అడుగులు వేస్తుంది అని అంటున్నారు. అంతే కాదు ఈ ఎన్నికల్లో జరిగిన పొరపాట్ల నుంచి తగిన గుణపాఠాలు కూడా నేర్చుకుని మొత్తం చక్కదిద్దుకుంటుందని కూడా అంటున్నారు.

# యంత్రాల పరుగులు.. వేగంగా పనులు



భూపాలపల్లి : భారీ వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగగా.. ప్రస్తుతం బొగ్గు వెలికితీతకు యంత్రాలు, రవాణా వాహనాలు పరుగులు పెడుతున్నాయి.. ఉత్పత్తి పుంజుకుంటోంది. కుంభవృష్టి వానలతో సింగరేణి వ్యాప్తంగా ఉపరితల గనుల్లో రెండు మిలియన్లకు పైగా ఉత్పత్తి నష్టం జరిగిన విషయం తెలిసిందే.. వర్షం ఆగిపోవడంతో క్వారీల్లోకి వాహనాలు వెళ్లేందుకు రహదారులు చదును చేశారు. దీంతో యంత్రాలు క్వారీల్లోకి సులువుగా వెళ్లడానికి మార్గం సుగమమైంది. ఉత్పత్తి మొదలైంది. మరోవైపు గనుల్లోకి చేరిన నీటిని భారీ సామర్థ్యం గల పంపుల ద్వారా ఉపరితలానికి పంపిస్తున్నారు.

**రూ.22 కోట్లు నష్టం**

వర్షాల మూలంగా ఓసీపీల్లో రోజుకు 1.7 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. ఒక్కోరోజు అసలు మొత్తానికే ఉత్పత్తి చేపట్టని పరిస్థితులు తలెత్తాయి. భారీ వర్షాలతో క్వారీలన్నీ జలమయమయ్యాయి. దీంతో డంపర్లు, షావల్స్, డోజర్లు నడిచే పరిస్థితి లేకుండా పోయింది. భారీ వర్షానికి క్వారీల్లోకి నీరు చేరడంతో పాటు రహదారులు బురదమయంగా మారాయి. సింగరేణి వ్యాప్తంగా 19 ఉపరితల గనుల్లో వర్షాలకు ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు స్థానిక అధికారులతో సమీక్ష నిర్వహించి వెంటనే ఉత్పత్తి దశలోకి తీసుకురావాలని ఆదేశించారు. భూపాలపల్లి ఏరియాలో దాదాపు రూ.22 కోట్ల నష్టం వాటిల్లింది.

**పెరిగిన డిమాండ్**

కొద్ది రోజులుగా వినియోగదారులకు సరిపడా బొగ్గు రవాణా చేయలేకపోవడంతో వినియోగదారుల నుంచి ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో క్రమంగా ఉత్పత్తి తిరిగి పెంచుకునే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. యంత్రాలు విరామం లేకుండా పనిచేయడంతో పాటు అవసరమైన నిర్వహణ చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో ఉపరితల గనుల అధికారులు, మేనేజర్లు ప్రత్యేకంగా ఉత్పత్తిపై దృష్టి సారించారు. నిల్వలు కూడా పూర్తికావడంతో ప్రస్తుతం ఉత్పత్తి పెంచుతున్నారు.

**రవాణాకు ఆటంకం లేకుండా..**

ఉత్పత్తి చేసిన బొగ్గు వినియోగదారులకు రవాణా చేసేందుకు రోడ్డు, రైలు మార్గాలకు సంబంధించి ఎలాంటి ఆటంకాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. లారీలు, రైలు వ్యాగన్ల ద్వారా బొగ్గు రవాణా చేసేందుకు సంప్రదింపులు చేస్తున్నారు. సకాలంలో వ్యాగన్లను సమకూర్చాలని అధికారులతో సమన్వయం చేస్తున్నారు. ప్రధానంగా సీహెచ్‌పీల నుంచి బొగ్గు రవాణా చేస్తారు.

# గూడుకట్టిన అక్రమాలు!



భూపాలపల్లి : భూపాలపల్లి పురపాలక సంఘం పరిధిలో ఇంటి నెంబర్ల కేటాయింపులో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. నిబంధనల ప్రకారం.. ఏ స్థలంలో ఇల్లు నిర్మించుకున్నారో ఆ స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇంటి నిర్మాణ అనుమతి ఉంటేనే ఇంటి నెంబర్ కేటాయిస్తారు. కానీ, ఇక్కడ కొన్నేళ్లుగా అసలు ఇళ్లు లేకున్నా ఇంటి నంబర్లు కేటాయించటం పరిపాటిగా మారింది. ఆరేడేళ్లుగా ఈ దందా గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతోంది. నివాసం ఉండని ఇళ్లకు సైతం పురపాలక సంఘం పరిధిలో అధికారులు ఇంటి నంబర్లు కేటాయించడం అక్రమాలకు పరాకాష్టగా మారింది.

జిల్లాలోని ఏకైక మున్సిపాలిటీ భూపాలపల్లి పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. బొగ్గు గనుల తవ్వకాలు, అతి సమీపంలోనే విద్యుదుత్పత్తి కేంద్రం ఉండటంతో ఇతర జిల్లాల నుంచి వందల సంఖ్యలో నిరుద్యోగులు, వ్యాపారులు, కార్మికులు ఉపాధి నిమిత్తం ఇక్కడికి వలస వచ్చి స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వివిధ కార్మిక కాలనీల్లో ఖాళీ నివాస స్థలాల్లో కొత్త గృహాలు విస్తరిస్తున్నాయి. మున్సిపాలిటీ రికార్డుల ప్రకారం మొత్తం 12,186 ఇళ్లు ఉన్నాయి. ప్రతి ఇంటికి నెంబర్ ఉంటేనే ఆ ఇంటికి విద్యుత్ మీటరు మంజూరు, గ్యాస్ సిలిండర్, తాగునీటి నల్లా వంటి వసతుల సమకూరుతాయి. ఈ క్రమంలోనే కొందరు ప్రభుత్వ భూములు, వివాదాస్పద, కోర్టు కేసుల్లోని భూముల్లో నిర్మించుకుంటున్న ఇళ్లకు దర్జాగా ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసి, బదిలీపై వెళ్లిన ఓ అధికారి అసలు ఇళ్లే లేకున్నా ఇంటి నెంబర్లు కేటాయించినట్లు ఆరోపణలున్నాయి. కొందరు దళారులు ఈ వ్యవహారంలో రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

**ఎందుకు తీసుకుంటున్నారంటే..**

ఇంటి నెంబరు అనేది ఒక హక్కు.. ఖాళీ నివాస స్థలం ఉంటే ఎవరైనా అదే స్థలానికి తప్పుడు సర్వే నెంబర్ల పేరుతో నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి కబ్జా చేస్తారనే భయంతోనే కొందరు ఆ నివాస స్థలం చుట్టూ ప్రహరీ, చిన్న రేకులతో షెడ్ నిర్మించుకొని ఇంటి నెంబరు పొందుతున్నారు. ప్రభుత్వ భూములు, చెరువు శిఖంలో అక్రమంగా ఇళ్లు నిర్మించకుని ఇంటి నెంబరు సంపాదిస్తే.. మున్సిపాలిటీకి ఇంటి పన్ను చెల్లిస్తున్న పత్రాల ఆధారంగా కోర్టుకు వెళ్తే న్యాయం జరుగుతుందని కొందరు ఎత్తుగడ వేస్తున్నారు. కొద్ది నెలల క్రితం ఓ కార్మిక కాలనీలో అసలు ఇళ్లు లేకున్నా ఆరు షెడ్‌ల పేరుతో ఎలా ఇంటి నెంబర్లు కేటాయించారంటే ఏ మేరకు ఈ దందా కొనసాగుతుందో అర్థం చేసుకోవచ్చు.. కొందరు ప్రజాప్రతినిధుల ఒత్తిడి కారణంగా అధికారులు, సిబ్బంది మామూళ్లు పుచ్చుకుని కేటాయిస్తున్నారనే విమర్శలున్నాయి.

**నిబంధనలు ఇవీ..**

భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు, కోర్టు కేసుల్లో లేకుండా ఉన్న స్థలాల్లో ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయిస్తారు. అనంతరం విద్యుత్తు మీటరు, తాగునీటి నల్లా కనెక్షన్ పొందవచ్చు. ఇంటి నంబరు కేటాయించే ముందు ఇంటి విస్తీర్ణం.. ఖాళీ స్థలం ఎంత ఉంది....? కిటికీలు, దర్వాజలు ఎన్ని..? రేకుల షెడ్ ఉందా భవనమా...? అనేది తెలుసుకున్న తర్వాతనే కేటాయించి, ఆస్తి పన్ను విధించాల్సి ఉంటుంది.

**మచ్చుకు కొన్ని..**

పట్టణంలోని కృష్ణా కాలనీలో సింగరేణి కార్మిక కుటుంబాలకు గతంలో పంపిణీ చేసిన నివాస స్థలాలు 30 వరకు ఖాళీగా ఉంటున్నాయి. ఇంటి స్థలాలు తీసుకున్న వారికి సింగరేణి సంస్థ నిర్మించిన క్వార్టర్లు కేటాయించరనే ఉద్దేశంతో కొందరు ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోలేదు. కొద్ది నెలల క్రితం ఇలాంటి స్థలాలకు ఇంటి నెంబర్లు పొంది, వాటిని ఇతరులకు విక్రయించినట్లు తెలిసింది.

మంజూరునగర్ ప్రాంతంలో ఓ రియల్టర్ దాదాపు 15 ఎకరాలకు పైగా ప్లాట్లుగా విభజించి అమ్మకాలు కొనసాగించగా, కొందరు ఉద్యోగులు,

కార్మికులు ఆ నివాస స్థలాలను కొనుగోలు చేసుకున్నారు. అప్పటి ఆర్థిక పరిస్థితుల కారణంగా కొందరు రిజిస్ట్రేషన్లు చేసుకోలేదు. వ్యవసాయ భూములను కొనుగోలు చేసిన రియల్టర్ 'నాలా' మార్పిడి చేయలేదు. దీంతో ఆ రైతు, కుటుంబ సభ్యులు కలిసి మరికొందరికి ఆ భూములు రిజిస్ట్రేషన్ చేశారు. ఇరువర్గాలు పోలీసు స్టేషన్, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ ప్రాంతంలో అసలు ఇళ్లు లేకున్నా దాదాపు పదుల సంఖ్యలో మున్సిపాలిటీ అధికారులు ఇంటి నెంబర్లు కేటాయించడం విశేషం.

బొగ్గు తవ్వకాల కోసం సింగరేణి యాజమాన్యం రిక్వేషన్ పెట్టుకున్న భూముల్లో ఎలాంటి ఇంటి నిర్మాణాలకు అనుమతి ఉండదు. కానీ, ఇక్కడ సింగరేణి సంస్థ నుంచి నష్టపరిహారం పొందడానికి వందల సంఖ్యలో నాలుగేళ్ల క్రితం కొత్త ఇళ్లు నిర్మించారు. ఇలాంటి ఇళ్లకు ఇంటి నంబర్లు లేకుంటే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం మంజూరు కాదనే ఉద్దేశంతో అప్పట్లో ఓ అధికారి 60 పైగా ఇంటి నెంబర్లు కేటాయించారు. అటు సింగరేణిని మోసం చేయడమే కాకుండా లక్షలాది రూపాయల ప్రజాధనం నష్టపరిహారం పొందడానికే అక్రమంగా ఇంటి నెంబర్లు ఇచ్చారు.

**చట్టవిరుద్ధమే..**

**– భాస్కర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్**

ఇల్లు లేకుండా ఇంటి నెంబర్ కేటాయించటం చట్ట విరుద్ధమే అవుతుంది. నేను ఆర్ఐగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఎలాంటి అక్రమాలకు ఆస్కారం ఇవ్వలేదు. అయినా గతంలో ఇళ్లు లేకున్నా ఎన్ని ఇంటి నెంబర్లు ఇచ్చారనే విషయంపై పూర్తిగా విచారించి, పై అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

# లోపల డిజిటల్ తెర.. మూసేస్తే గ్రీన్‌చాక్ బోర్డు

ములుగు : ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా పద్ధతి కొత్త పుంతలు తొక్కుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తిని పెంచుతోంది. ఇందులో బాగంగా మన ఊరు మన బడి కార్యక్రమం కింద ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులతో పాటు డిజిటల్ తరగతుల నిర్వహణ చేపడుతున్నారు. ఎంపికైన అన్ని పాఠశాలల్లో డిజిటల్ తెరలు, గ్రీన్ చాక్ బోర్డులు ఏర్పాటు చేశారు. అన్ని సబ్జెక్టులను డిజిటల్ తరగతుల నిర్వహణ ద్వారా బోధించేందుకు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు రెండు రకాలుగా పాఠాలు బోధించేలా బోర్డు సిద్ధం చేశారు. డిజిటల్ తరగతులు ముగిసిన తర్వాత తెరను మూసేసి దానిపైన అమర్చిన గ్రీన్ చాక్ బోర్డుపై పాఠాలు బోధించే విధంగా స్లైడ్ పద్ధతి అనుసరిస్తున్నారు. డిజిటల్ తెరపై తరగతులు నిర్వహించిన తర్వాత విద్యార్థికి పాఠాలు మరింత అర్థమయ్యేందుకు సందేహాలు నివృత్తి చేసేందుకు ఉపాధ్యాయుడు గ్రీన్ చాక్ బోర్డుపై వివరించాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్న సమయంలో విద్యుత్ సరఫరా, అంతర్జాలంలో అంతరాయం కలిగినప్పుడు వెంటనే బోర్డుపై పాఠాలు బోధించే అవకాశం ఉంటుంది. డిజిటల్ తెరకు రక్షణగా కూడా బోర్డులు ఉపయోగపడుతున్నాయి. బోర్డుకు తాళం కూడా



వేస్తున్నారు. జిల్లాలో మొత్తం 36 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు మన ఊరు మన బడి కింద ఎంపికయ్యాయి. వీటిలో 33 పాఠశాలలకు డిజిటల్ తెరలు, గ్రీన్ చాక్ బోర్డులు ఏర్పాటు చేశారు.

# అక్రమాల లెక్క తేల్చేదెన్నడు?

కరీంనగర్: రోగుల చికిత్సకు ఉపయోగపడాల్సిన నిధులవి.. ఆసుపత్రి అభివృద్ధికి వాడాల్సినవి.. వైద్యసేవల మెరుగుకు దోహదపడాల్సినవి.. వందలు, వేలు కాదు.. ఏకంగా లక్షలాది రూపాయల సొమ్ముకు రెక్కలొచ్చాయి. కాకి లెక్కల రూపంలో చేయని పనులకు ఇష్టానుసారంగా ఖర్చయ్యాయి. అడ్డూ అదుపు లేకుండా ఖజానా నుంచి మాయమయ్యాయి. కాపాలాగా ఉండాల్సిన వారే నొక్కేశారో.. లేదా ఖాళీగా ఖాతాల్లో ఉంచడం ఎందుకని జేబుల్లోకి తోసేశారో ఏదైతేనేం ప్రజాధనమిలా ఎప్పటికప్పుడు పక్కదారి పట్టింది. ఆడిట్ రూపంలో అసలు వ్యవహారం కొన్నాళ్ల కిందట బట్టబయలైంది. తప్పుల తడకల వ్యవహారమంతా వెలుగులోకి వచ్చింది. చేతివాటాలు చూపిందెవరనేది ప్రాథమికంగా నిగ్గు తేలింది. విచారణలు మొదలయ్యాయి.. చర్యలు క్రమంగా కనిపించాయి. కాలం గడిచినా కొద్దీ.. అసలు లోగుట్టు తెలియడం లేదు. కాలం ముందుకు కదులుతున్నా.. ఈ తతంగం అక్కడే ఆగిపోయింది. ఇదంతా కరీంనగర్ జిల్లాసుపత్రిలోని నిధులు దుర్వినియోగం విషయంలో ఎదురవుతున్న లెక్కల చిక్కుల వ్యథ.!

ఏం జరిగిందంటే? గతేడాది నవంబరు 19న జిల్లాసుపత్రి అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అసలు ఆసుపత్రికి వస్తున్న నిధులెన్ని..? చేస్తున్న ఖర్చెంత..? అని మంత్రి గంగుల కమలాకర్ అధికారులను అడగ్గా వారంతా నీళ్లు నమిలారు. జాతీయ ఆరోగ్య మిషన్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులు, వివిధ పథకాలకు వచ్చినవి.. ఎంసీహెచ్‌లోని అద్దెగదుల ఆదాయం.. ఇలా అన్ని కలిపి దాదాపు రూ.68 లక్షల విషయంలో లెక్కలడగగా బాధ్యులైన ఆసుపత్రి వర్గాలు ఏం చెప్పకుండా చేతులెత్తేశారు. తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి చివరి వారంలో రాష్ట్ర స్థాయి ఆడిట్ అధికారుల పరిశీలనలో ఇక్కడి డొల్లతనం బయటపడింది. వ్యయం విషయంలో అసలు ఏ పత్రాలు లేవని.. నిధులు ఎందుకోసం ఖర్చు చేశారనే వివరాలు లేవని తేల్చి చెప్పారు. నివేదిక ఉన్నతాధికారులకు పంపించారు. నిర్లక్ష్యం వహించారనే సాకుతో ఓ జూనియర్ సహాయకుడిపై సస్పెన్షన్ వేటు వేశారు. మొత్తంగా ఆసుపత్రి పర్యవేక్షిస్తున్న ఓ అధికారిణి ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఆమె ఆ కుర్చీలో ఉంటే అసలు లోగుట్ట పక్కాగా తెలియదని బాధ్యతల నుంచి తప్పించారు. సమగ్ర విచారణ జరపాల్సిందేనని రాష్ట్ర స్థాయి



అధికారులు నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే ఈ నిధుల గుట్టు నిగ్గు తేలుస్తామని ప్రకటించి.. తరువాత నెలలు గడుస్తున్నా.. ఈ విషయాన్ని మరిచిపోయారు. గోల్‌మాల్ డబ్బుల స్వాధీనం వ్యవహారం అక్కడితోనే ఆగిపోయింది జరగాల్సిన విచారణ అటకెక్కింది.

**ఒత్తిళ్లకు తలొగ్గారా?**

కరీంనగర్ జిల్లాసుపత్రి వ్యవహారాలన్నీ ప్రత్యేకమే. ఇక్కడ ఏది జరిగినా తేలిగ్గా తీసుకుంటారనే ప్రచారముంది. దీన్ని నిజం చేసే విధంగా ఈ నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో ఇంకా కొనసాగాల్సిన విచారణ అర్ధాంతరంగా ఆగిపోయింది. దీని వెనుక పెద్ద వ్యవహారమే నడిచిందనే ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ ఒత్తిళ్ల ప్రాధాన్యం అంతే బలంగా ప్రభావం చూపుతుందని కొందరు వారి వాదనలు వినిపిస్తుండగా.. చేసిన తప్పులను కప్పిపుచ్చేందుకు సొంత శాఖలోని కొందరు పెద్దోళ్లు సహకరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర స్థాయి నుంచి ఆడిట్ సమయంలోనే కీలక ఆధారాలు లభించినట్లు తెలిసింది. వాటిపై సమగ్ర విచారణ జరిపితే బాధ్యులెవరనేది తేటతెల్లమయ్యేది. చాలా సందర్భాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్ణీత మొత్తానికి మించి చెక్కుల రూపంలో నగదు ఉపసంహరించుకున్నారని తెలిసింది. ఇలా ఎవరెవరు చేశారు..? వాటిని దేనికి వినియోగించారనే విషయాలను విచారణలో గుర్తించాల్సి ఉంది. కానీ తరువాత విచారణ కొనసాగకపోవడంతో ఈ స్వాహాపర్వం అంతటితో ఆగిపోయింది. ఈ ఏడాది ఫిబ్రవరి 22న రాష్ట్రస్థాయి అధికారులు ఆడిట్ చేసి వెళ్లారు. అదే నెల 24న ఆస్పత్రి బ్యాంక్ ఖాతాలో దాదాపు 6 వేర్వేరు ఓచర్లతో రూ.3.82 లక్షలను ఉద్యోగి ఒకరు జమ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా పక్కదారి పట్టిన సొమ్ములో నుంచి వేర్వేరు రోజుల్లో మొత్తంగా రూ.8 లక్షల వరకు తిరిగి ఖజానాకు చేర్చారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా.. నిధుల దుర్వినియోగం విషయంలో విచారణ అంశం రాష్ట్రస్థాయి అధికారుల పర్యవేక్షణలో సాగుతుందని చెప్పారు. తాను ఛార్జ్ తీసుకున్నప్పటి నుంచి మాత్రం ఆసుపత్రి నిధుల విషయంలో పక్కాగా అన్ని లెక్కలను నిబంధనల ప్రకారం ఉండేలా చూస్తున్నామని తెలిపారు.

# నిర్లక్ష్య ప్రాంగణాలు




కరీంనగర్: అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి, ఎల్లంపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలను చూసిన వారంతా విస్మయం చెందుతున్నారు. బ్రాహ్మణపల్లిలో పొలం వద్ద బోర్డు వేసి వదిలేశారు. ఆట పరికరాలను కూడా ఏర్పాటు చేయలేదు. ఎలంపల్లిలో ఆట పరికరాలు ఏర్పాటు చేసినా చుట్టూ పిచ్చిమొక్కలు, పక్కనే మురుగు ఉండటంతో దుర్గంధంతో క్రీడాకారులెవరూ రావడం లేదు. ప్రభుత్వం పల్లె ప్రాంగణాల నిర్మాణానికి రూ.లక్షలు వెచ్చిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల అసత్వంతో లక్ష్యం నెరవేరడం లేదు.

# పల్లెవించిన హస్తం..!



నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లా..రాష్ట్రంలోనే కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలంగా ఉన్న జిల్లాల్లో ఒకటి. పార్టీ రాష్ట్ర అగ్రనాయకత్వం అంతా ఇక్కడే కేంద్రీకృతమైనా గతంలో మూడు గొడవలు..ఆరు వర్గాలుగా ఉండేది. పార్టీ అధిష్ఠానం వ్యూహాలు, పదేళ్లుగా అధికారంలో లేకపోవడంతో వర్గ విభేదాలను వీడి సీనియర్ నేతలంతా ఐక్యతతో పనిచేయడంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో పన్నెండింటికిగానూ 11 స్థానాల్లో ఆ పార్టీ గెలుపొంది సత్తా చాటింది. ఉమ్మడి జిల్లాలో ఇన్ని స్థానాలతో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడం చరిత్రలో ఇదే తొలిసారి. 2018లో జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 88.01 శాతం పోలింగ్ నమోదవగా.. ఈ ఎన్నికల్లో అది 86.53కి పడిపోయింది. సుమారు 1.5 శాతం తగ్గడం..అదీ పట్టణ ప్రాంతాల్లోనే కావడంతో అభ్యర్థుల జాతకాలు తారుమారు అయితాయనే ఆందోళన ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో వ్యక్తమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా పోలింగ్ శాతం నమోదు కావడంతో రైతులు, పింఛన్ దారులు తమకే ఓటేశారని భారాస అభ్యర్థులు ధీమా వ్యక్తం చేశారు. అయితే ఫలితాల సరళిలో గతానికి భిన్నంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ కాంగ్రెస్ సత్తా చాటింది. పదేళ్లుగా సంప్రదాయ ఓటు బ్యాంకుగా ఉన్న రైతులు, పింఛన్‌దారులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఈ దఫా కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారు. ఉదాహరణకు నల్గొండ గ్రామీణ మండలంలోని ఓ పోలింగ్ బూత్‌లో 1132 ఓట్లు ఉండగా..ఇందులో గత రెండు ఎన్నికల్లోనూ భారాసకు 370కి పైగా మెజార్టీ వచ్చింది. ఈ దఫా కాంగ్రెస్ పార్టీకి ఏకంగా 80 శాతం ఓట్లు పడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. సంక్షేమ పథకాలు గట్టెక్కిస్తాయని భారాస సిట్టింగులు అంచనా వేసినా కాంగ్రెస్ పార్టీ తామిచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో విజయవంతం అయింది.

పకడ్బందీగా అభ్యర్థుల ఎంపిక గతంతో పోలిస్తే ఉమ్మడి జిల్లాలోని పన్నెండు స్థానాల్లో అభ్యర్థుల ఎంపికలో పార్టీ పకడ్బందీ వ్యూహాన్ని అమలు చేసింది. ఉమ్మడి జిల్లాలోని సీనియర్ నేతలు జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సలహాలు, సూచనలు తీసుకుంటూనే సర్వే నివేదికల ఆధారంగానే వారిని ఎంపిక చేసింది. సర్వేలో గెలుపు అవకాశాలు ఉన్నాయన్న కారణంతో భారాసలో చేరిన భువనగిరి నియోజకవర్గం నాయకుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో ఏకంగా పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్వయంగా మాట్లాడటం, పార్టీలో చేరిన వెంటనే టిక్కెట్ ప్రకటించడం, మునుగోడులో రాజగోపాల్‌రెడ్డిని తిరిగి పార్టీలోకి రప్పించేందుకు దిల్లీ స్థాయిలో మంత్రాంగం నడపడం దీనిలో భాగంగానే జరిగిందని పార్టీ నాయకులు వెల్లడిస్తున్నారు. గత రెండు ఎన్నికల్లో త్రుటిలో విజయం చేజారిన తుంగతుర్తి లాంటి స్థానంలో స్థానికుడికి అవకాశం ఇవ్వడం, బీసీ కోటాలో ఆలేరులో ఎంపిక చేయడం లాంటివి అన్ని సర్వే నివేదికల ఆధారంగానే జరిగింది. సీపీఎంతో పొత్తు నేపథ్యంలో చివరి వరకు వేచిచూసిన మిర్యాలగూడలో గత కొన్నాళ్లుగా అక్కడ పనిచేసి సర్వేల్లో ముందున్న బత్తుల లక్ష్మారెడ్డి లాంటి గెలుపు గుర్రాలకు టిక్కెట్ ఇవ్వడంతోనే ఈ విజయం సాధ్యమైందన్న వాదన పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. నకిరేకల్‌లోనూ భారాస నుంచి వచ్చిన వేముల వీరేశంకు, సూర్యాపేటలో సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి టిక్కెట్ ఇవ్వడంతో పాటూ ఈ స్థానాల్లో అభ్యర్థిత్వం ఆశించిన అసంతృప్తులకు ఏకంగా కేసీ వేణుగోపాల్ స్థాయిలో బుజ్జగించడం సత్ఫలితాలనిచ్చింది.

## అద్దెకు వ్యవసాయ సాగు యంత్రాలు

భువనగిరి : చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడేలా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ యంత్రాలు, పరికరాలను తక్కువ ధరకే అద్దెకు ఇస్తున్నారు. గ్రామాల్లో కూలీల సంఖ్య తగ్గిపోవటం.. వారికి చెల్లించే వేతనాలు ఎక్కువగా ఉండటంతో రైతులు వ్యవసాయ యాంత్రీకరణ వైపు మొగ్గు చూపుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని సంస్థాన్ నారాయణపురంతో పాటు మోత్కూరు, తుర్కపల్లి, బొమ్మల రామారంలో మండల సమాఖ్య కేంద్రాల్లో రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రాలను (కస్టమ్ హైరింగ్ సెంటర్లు) ఏర్పాటు చేశారు. గత ఏడాది జిల్లాలో రామన్నపేట, వలిగొండ, భువనగిరి, బీబీనగర్ మండల సమాఖ్య కేంద్రాల్లో కూడా వీటిని ఏర్పాటు చేశారు. జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) పథకంలో భాగంగా రాయితీపై బ్యాంకు రుణాలు మండల సమాఖ్యల వాటా ధనంతో ఈ యంత్ర



పరికరాలను సమకూర్చారు. ఒక్కో కేంద్రానికి రూ.10 లక్షల విలువైన యంత్రాలను సమకూర్చారు. దుక్కి దున్నడం మొదలు విత్తనాల విత్తడం, కలుపు తీయడం, పంట పండిన తర్వాత నూర్పిడి చేయడం వంటి అవసరాలకు ఉపయోగపడే యంత్రాలతో పాటు స్ప్రేయర్లు, రోటోవేటర్, నాటు వేసే యంత్రాలు, కల్టివేటర్ తదితర పరికరాలతో అద్దె కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఈ పరికరాలను అద్దెకు ఇవ్వడం వల్ల సమాఖ్య మహిళలకు ఆదాయం సమకూరనుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి - యాదయ్య, ఏపీఎం

రైతులకు వ్యవసాయ యంత్రాలు, పరికరాలను తక్కువ ధరకు కిరాయికి ఇచ్చేందుకు మండల సమాఖ్య వద్ద సీహెచ్‌సీ (క్లస్టర్ హైరింగ్ సెంటర్)ను ఏర్పాటు చేశాం. రైతులు, కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి. దీని వల్ల సన్న, చిన్నకారు రైతులకు మేలు జరుగుతుంది. సాగు యంత్రాలు అద్దెకు ఇవ్వడంతో ఇప్పటి వరకు మండల సమాఖ్యకు రూ.80 వేల ఆదాయం సమకూరింది.

## బూడిద విక్రయాలపై కేటీపీఎస్ దృష్టి

పాల్వంచ : పాల్వంచలోని కేటీపీఎస్ విద్యుత్కేంద్రం నుంచి రోజుకు వేల టన్నుల్లో బూడిద వెలువడుతుంది. బూడిద విక్రయాలను ఆదాయ వనరుగా మలుచుకునేందుకు టీఎస్ జెన్కో యాజమాన్యం చర్యలు చేపడుతోంది. గతంలో లేనివిధంగా ఈ ఏడాది అధిక ధరకు విక్రయిస్తోంది. వాస్తవానికి కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆదేశాల ప్రకారం కేటీపీఎస్ కర్మాగారాల నుంచి వెలువడే బూడిదను గతంలో ఉచితంగానే అందజేశారు. ఎవరైనా, ఎలాంటి అనుమతులు అవసరం లేకుండా తీసుకెళ్లేవారు. గుట్టలుగా పేరుకుపోయి ప్రభావిత గ్రామాల్లో కాలుష్య సమస్య పెరగవద్దనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కాకపోతే లోడింగ్ ఖర్చులను తీసుకెళ్లేవారే భరించాల్సి వచ్చేది. కాలక్రమేణా బూడిద ఆధారిత ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. అయినా స్థానికులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా 2016లో టన్ను బూడిద రూ.10 ధరకే కేటాయించారు. ఈ విధానం 2019 వరకు కొనసాగింది. ఆ ఏడాది నుంచి మార్కెట్‌లో డిమాండ్ భారీగా పెరగడంతో తొలిసారి టీఎస్ జెన్కో టెండర్ ప్రక్రియ అమలు చేసింది. టెండరులో టన్ను బూడిదను రూ.68కి కొనుగోలు చేసేందుకు గుత్తేదారుడు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ తర్వాత 2020-2022 సంవత్సరానికి జరిగిన టెండరులో టన్ను రూ.75కు పెరిగింది. ప్రస్తుతం ఇది రూ.305కి చేరుకుంది. వేలం దక్కించుకున్న గుత్తేదారుడు ఆ మొత్తాన్ని చెల్లించి.. బయట టన్ను రూ.380కి విక్రయించుకుంటున్నాడు. ప్రతి ఏటా నవంబరు నుంచి మార్చి 31 వరకు బూడిద విక్రయించుకునేలా యాజమాన్యం అనుమతులు ఇస్తోంది. తాజాగా బూడిద తరలింపు కొనసాగుతోంది. యాష్ ధర, రవాణా ఖర్చులు అమాంతం పెరిగిన నేపథ్యంలో పలు సిమెంటు కర్మాగారాల యాజమాన్యాలు కేటీపీఎస్ నుంచి కొనుగోలు చేసే విషయంపై మల్లగుల్లాలు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి కేటీపీఎస్ 5, 6, 7 దశల కర్మాగారాల్లో ప్రస్తుతం 1,800 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. రోజువారీగా 25 వేల టన్నుల బొగ్గును వినియోగిస్తున్నారు. ఫలితంగా రోజుకు 13 వేల మెట్రిక్ టన్నుల బూడిద సైలో, యాష్‌పాండ్ పద్ధతిలో బయటకు వస్తోంది. కేటీపీఎస్ కర్మాగారం పరిధిలో ఇప్పుడు రెండు యాష్ పాండ్‌లు 836 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. ఆయా చెరువుల్లో ప్రస్తుతం 3.75 కోట్ల మెట్రిక్ టన్నుల బూడిద నిల్వలు ఉన్నాయి. గతేడాది టన్ను రూ.300కి విక్రయించగా, డిమాండ్‌ను బట్టి ధరను ఇటీవల మరో రూ.80 పెంచారు. బయట మార్కెట్ పరిస్థితులను బట్టి గుత్తేదారుల మధ్య కూడా పోటీ పెరిగింది. తమ ఆధిపత్య పోరుతో కొందరు టెండర్లలో అధిక ధర వెచ్చించేందుకు ముందుకొస్తున్నారు. ఇదే క్రమంలో టెండరు దక్కినవారు తప్పని పరిస్థితుల్లో టన్ను మార్కెట్ ధరను పెంచాల్సి వస్తోంది.

అక్రమ తరలింపుపైనా నజర్

గతంలో బూడిద లారీలు వెళ్లడానికి రెండు మార్గాలున్నాయి.. అవి పునుకుల, సూరారం రోడ్లు. లారీల కారణంగా ఆయా ప్రాంతాల్లో కాలుష్యం పెరిగిపోతోందని తరచూ స్థానికులు వ్యతిరేకత తెలిపేవారు. ఈ నేపథ్యంలో 2023 ప్రథమార్థం నుంచి కేటీపీఎస్‌లో మూతపడిన ఓఅండ్ఎం కర్మాగారం మీదుగా నేరుగా బూడిద లారీలు రాకపోకలు సాగించేందుకు యాజమాన్యం వీలు కలిగిస్తోంది. రోడ్డు మార్గం పనుల కోసం రూ.కోటి నిధులు కేటాయించింది. ఒక వంతెన నిర్మాణంతో పాటు మరో రెండు పునరుద్ధరించాల్సి ఉంది. నెల రోజుల్లో ఆయా పనులు పూర్తి చేయడానికి యాజమాన్యం గుత్తేదారుతో ఒప్పందం చేసుకుంది. ఈ పనులు పూర్తయితే గుత్తేదారులు బూడిదను అనుమతికి మించి తరలించే అవకాశాలు ఉండవు.

నెల రోజుల్లో రోడ్డు పనులు పూర్తి

మేక ప్రభాకర్‌రావు, సీఈ, ఐదు,ఆరు దశలు

కొత్త ఒప్పదం ప్రకారం నవంబరు నుంచి పెంచిన ధరలకు బూడిద తరలింపు జరుగుతోంది. ఓఅండ్ఎం మీదుగా వాహనాల రాకపోకలకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి లభించింది. రోడ్డు విస్తరణ పనులకు నిధులు కూడా మంజూరు చేశారు. త్వరలో పనులు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించాం. బూడిద విక్రయాల్లో అక్రమాలకు తావులేకుండా, వీలైనంత ఆదాయం సమకూరేలే చర్యలు చేపడుతున్నాం.

## అన్నదాతకు మిగ్‌జాం గండం



సూర్యాపేట : ప్రతికూల వాతావరణ పరిస్థితులు అన్నదాతను కుదిపేస్తున్నాయి. కష్టించి సాగు చేసిన పంట చేతికందే సమయానికి వాతావరణ మార్పుల ప్రభావంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం వరి కోతలు ముగింపు దశకు చేరుకున్నాయి. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించేందుకు ఆరబోసుకుంటు న్నారు. వడ్లు ఎండుతున్న దశలో మిగ్‌జాం తుపాను ఉందంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోని కోదాడ, సూర్యాపేట, హుజూర్‌నగర్, తుంగతుర్తి నియోజకవర్గాల పరిధిలోని 26 మండలాల్లో 4,37,000 ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం కోతలు చివరి దశకు వచ్చాయి. తడిసిన ధాన్యం రంగు మారుతుందని దీనివల్ల గిట్టుబాటు ధర కోల్పోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధాన్యం రంగు మారుతోంది- భూషయ్య, ధాన్యం రైతు, సూర్యాపేట

నేను ఐదు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. కోతలు చివరి దశకు వచ్చాయి. వాతావరణ మార్పుల వల్ల ఆరబోసిన ధాన్యాన్ని రెండు వారాలుగా అలాగే ఉంచుతున్నారు. ఎండలు తక్కువగా ఉండటంతో తిప్పలు తప్పడం లేదు. ఎక్కువ రోజులు వడ్లు అలానే ఉండడంతో టార్పాలిన్ కింది నుంచి పదును ఎక్కుతుంది. ధాన్యం నానిపోవడం వల్ల నల్ల రంగు మారుతుంది. కొనుగోలు కేంద్ర ఆవరణలో ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టడం వల్ల నాలుగు రోజులు ఆలస్యం అయింది. మళ్లీ తుపాను హెచ్చరికతో ధాన్యం ఎప్పుడు అమ్ముకోవాలో అర్థం కావడం లేదు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి:

- రామారావు నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, సూర్యాపేట

మిగ్‌జాం తుఫాను ప్రభావం ఉండే అవకాశం ఉంది. ధాన్యం ఆరబోసుకున్న రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఆలస్యంగా సాగు చేసిన బీపీటీ, తదితర రకాల పొలాలు కోయాల్సి ఉంది. పొలం ఆరితే వెంటనే కోసుకుని కేంద్రాలకు, మిల్లులకు తరలించుకోవాలి. ఎన్నికల నేపథ్యంలో కొన్ని చోట్ల కొనుగోళ్లు ఆలస్యంగా జరిగాయి. తిరిగి మిగిలిన ధాన్యాన్ని వెంటనే సేకరిస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎలాంటి ఇబ్బందులున్నా ఆయా మండలాల్లో వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

## ముందుకు సాగని పనులు!

భువనగిరి : భువనగిరి పట్టణంలోని పలు వార్డుల్లో ప్రతిపాదించిన పనులు ముందుకు సాగడం లేదు. వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం టీయూఎఫ్ఐడీసీ పథకం కింద రూ.37.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో పలు వార్డులో మురుగు కాలువలు, సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్, శ్మశాన వాటికల అభివృద్ధి, సుందరీకరణ పనులు ప్రతిపాదించారు. నిధులు అందుబాటులో ఉన్నప్పటికి ఇప్పటి వరకు 60 శాతం పనులు పూర్తి చేయడం గమనార్హం. మరో 40 శాతం పనులు ఇంకా ప్రారంభానికి నోచుకోవడం లేదు. వార్డుల్లో అభివృద్ధి కుంటుపడింది.

నిర్మాణాల తీరు ఇలా...

నులు పర్యవేక్షించి పట్టణాభివృద్ధికి చొరవ చూపాల్సిన డీఈ పోస్టు గత కొద్ది నెలలుగా ఖాళీగా ఉంది. ఉన్న ఏఈని డీఈగా ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పలు నిధులతో చేపట్టాల్సిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. టీయూఎఫ్ఐడీసీ రూ.20లక్షలు తొలి విడత, మరో దఫాలో రూ.17.50 కోట్లు మంజూరు చేసింది. మంజూరైన నిధులతో రూ.17.50 కోట్లతో సీసీ రోడ్లు, రూ.3.80 కోట్లతో పెద్ద మురుగు కాలువలు, రూ.2 కోట్లతో చిన్న మురుగు కాలువలు, రూ.1.90 కోట్లతో బీటీ రోడ్లు, రూ.1.30 కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం పలు వార్డుల్లో మురుగు



కాలువలు, సీసీ రోడ్లు, శ్మశాన వాటిక అభివృద్ధి పనులు, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టారు. ఇంకా పెద్ద, చిన్న మురుగు కాలువల పనులు 40 శాతం వరకు చేపట్టాల్సి ఉంది. రాయగిరితో పాటు 21, 23 వార్డుల్లో పనులు ఇంకా ప్రారంభం కాకపోవడం గమనార్హం. ఇప్పటికైనా పురపాలకులు ప్రతిపాదిత పనులను పూర్తి చేసి ప్రజలకు సదుపాయం కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై ఇన్‌ఛార్జి డీఈ కొండల్‌రావును వివరణ కోరగా ప్రారంభం కాని పనులను ప్రారంభిస్తామని, అసంపూర్తిగా నిలిచిన పనులను పూర్తి చేస్తామని వివరణ ఇచ్చారు.

## ఇక్కడొకటి.. అక్కడొకటి..!

ఆసిఫాబాద్ : జిల్లా ప్రజల తీర్పు ప్రతి ఎన్నికల్లో ప్రత్యేకంగా ఉంటుంది. జిల్లా ప్రజలు ఎప్పుడూ ఒక పార్టీకి స్పష్టమైన మెజార్టీ కట్టబెట్టలేదు. రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఎస్టీ నియోజకవర్గమైన ఆసిఫాబాద్‌లో ఒక పార్టీ గెలిస్తే.. జనరల్ స్థానమైన సిర్పూరులో మరొక పార్టీకి చెందినవారు విజయం సాధిస్తున్నారు. రాష్ట్రంలో భారాస హవా కొనసాగిన 2018 శాసనసభ ఎన్నికల్లో ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ దూసుకుపోగా.. ఇక్కడ భారాస అభ్యర్థి గెలుపొందడం ఇక్కడి వారి విభిన్న తీర్పునకు నిదర్శనం. అయితే 2018 ఎన్నికల్లో సిర్పూరులో భారాస అభ్యర్థి అత్యధిక ఓట్లు సాధించగా.. ఇప్పుడు ఆసిఫాబాద్ అభ్యర్థికి ఎక్కువ శాతం వచ్చాయి. 2018లో సిర్పూరు భారాస అభ్యర్థి 50శాతానికి పైగా, కాంగ్రెస్ అభ్యర్థి 35 శాతం పైగా ఓట్లు సాధించారు. ఈసారి ఆసిఫాబాద్‌లో భారాస అభ్యర్థి 44 శాతానికి పైగా, కాంగ్రెస్ అభ్యర్థి 32 శాతానికి పైగా ఓట్లు వచ్చాయి.

గత ఎన్నికల ఓట్లతో పోల్చితే ఈసారి 76 వేలకు పైగా ఓటర్లు పెరిగారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 2018 ఎన్నికల్లో



పోలింగ్ 86శాతం కాగా ఈసారి(2023) 81.43 శాతానికి పరిమితం కావడం గమనార్హం. ప్రస్తుత ఎన్నికల ఫలితాలను బట్టి ఈసారి పెరిగిన ఓట్లు ఆసిఫాబాద్‌లో భారాసకు, సిర్పూర్‌లో భాజపాకు లాభం చేకూరినట్లు తెలుస్తుంది.

ఓటమి అంతరం సైతం..

జిల్లాలో గత శాసనసభ ఎన్నికల్లో భారాస నుంచి కోవ లక్ష్మి, కాంగ్రెస్ నుంచి ఆత్రం సక్కులు పోటీ పడ్డారు. ఇద్దరు కూడా దాదాపు సమానంగా ఓట్లు సాధించారు. 171 ఓట్ల స్వల్ప మెజార్టీతో ఆత్రం సక్కు సమీప అభ్యర్థి కోవ లక్ష్మిపై విజయం సాధించారు. అప్పుడు నియోజకవర్గంలో మొత్తం పోలైన ఓట్లు 1,60,790. వీటిలో కాంగ్రెస్ అభ్యర్థి 65,788 ఓట్లతో 40.71 శాతం, భారాస అభ్యర్థి 65,617 ఓట్లతో 40.80 శాతం ఓట్లు సాధించారు. అంటే గెలుపు అంతరం 0.11 శాతమే. అదే సిర్పూర్‌లో మొత్తం పోలైన ఓట్లు 1,64,288 కాగా భారాస అభ్యర్థి కోనప్ప 83,088 ఓట్లతో 50.57 శాతం, కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు 58,813 ఓట్లతో 35.8 శాతం సాధించారు. ఈసారి ఎన్నికల్లో పరిస్థితి తారుమారు అయ్యింది. ఆసిఫాబాద్ భారాస అభ్యర్థి 23 వేలకు పైగా ఓట్లతో విజయం సాధించగా.. సిర్పూరు అభ్యర్థి కోనప్ప స్వల్ప తేడా(3 వేల ఓట్ల)తో ఓటమి చవిచూశారు.

## 5018 నుంచి.. 39,829 వరకు

మంచిర్యాల : మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్, భారాస ప్రధాన పార్టీలతో పాటు భాజపా అభ్యర్థి పోటీలో నిలవగా ఈ ఎన్నికల్లో అనూహ్యంగా భాజపా అధికార భారాసను వెనక్కి నెట్టి రెండో స్థానంలో నిలవడం ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరిచింది. 2018 ఎన్నికల్లో 5018 ఓట్లతో డిపాజిట్ కోల్పోయిన పార్టీ ఈ ఎన్నికల్లో 39,829 ఓట్లను రాబట్టింది. స్థానిక ఎమ్మెల్యే దివాకర్‌రావు కన్నా ఎక్కువ ఓట్లు సాధించిన భాజపా అభ్యర్థి వెరబెల్లి రఘునాథ్ పరాజయం పాలైనా పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపారు.

ప్రజల్లో ఉండి.. సమస్యల పరిష్కారానికి పోరాడి..

2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ప్రేమ్‌సాగర్‌రావు, భారాస తరపున దివాకర్‌రావు, భాజపా తరపున రఘునాథ్‌లు పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో దివాకర్‌రావు గెలుపొందగా రెండో స్థానంలో ప్రేమ్‌సాగర్‌రా



వు, మూడో స్థానంలో రఘునాథ్ ఉన్నారు. ఈ అభ్యర్థులే 2023 ఎన్నికల్లో పోటీలో నిలిచారు. ప్రధానంగా దివాకర్‌రావు, ప్రేమ్‌సాగర్‌రావుల మధ్య పోటీ ఉందని స్థానికంగా ప్రచారం జరిగింది. ఎన్నికల ప్రచారంలో మొదటి నుంచి భాజపా అభ్యర్థి రఘునాథ్ ప్రత్యర్థులకు దీటుగా ప్రచారం నిర్వహించారు. భాజపా కీలక నేత ఈటల రాజేందర్‌తో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలతో రోడ్‌షోలు నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాలు విజయవంతం కావడంతో పార్టీ శ్రేణులలో ఉత్తేజం నింపగా ప్రజలు కమలం పువ్వు గుర్తువైపు మళ్లడానికి కొంత మార్పు వచ్చింది. అభ్యర్థి రఘునాథ్ గత ఐదు సంవత్సరాల నుంచి స్వచ్ఛంద కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యలపై పోరాడుతు వస్తున్నారు. ఈ ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిపిన ప్రజలకు రాబోవు రోజుల్లో మరింత అందుబాటులో ఉంటానని, పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని రఘునాథ్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## నేరాలు పైపైకి

హైదరాబాద్: మహానగరంలో నేరాల రేటు వరుసగా పెరుగుతోంది. ఏటా సగటున రెండు వేల చొప్పున కేసులు అధికంగా నమోదవుతున్నాయి. జాతీయ నేర గణాంక సంస్థ(ఎన్‌సీఆర్‌బీ) క్రైమ్ ఇన్ ఇండియా- 2022(దేశంలో నేరాలు) నివేదికను తాజాగా విడుదల చేసింది. ఇందులో మెట్రో నగరాల వారీగా 2022లో నమోదైన నేర గణాంకాలను పొందుపర్చింది. ఐపీసీ, స్థానిక ప్రత్యేక చట్టాల కింద నమోదవుతున్న కేసుల సంఖ్య కలిపి చూడగా హైదరాబాద్‌లో గతేడాది 23,183 కేసులు నమోదయ్యాయి. 2021(మొత్తం 20,142)తో పోలిస్తే 15 శాతం అధికంగా రికార్డయ్యాయి. నమోదవుతున్న కేసుల్లో విచారణ పూర్తవుతున్నవి(ఛార్జిషీటు దాఖలు) కేవలం 67.8 శాతం మాత్రమే ఉండడం గమనార్హం. ఛార్జిషీటు దాఖలులో దేశంలోని 19 మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్ 14వ స్థానంలో ఉంది. కొచ్చి, లఖ్‌నవూ, నాగ్‌పూర్, పట్నా, సూరత్, పుణె వంటి నగరంలో మెరుగైన స్థానాల్లో ఉన్నాయి. ఎన్‌సీఆర్‌బీ దేశవ్యాప్తంగా 20 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న 19 ప్రాంతాల్ని మెట్రోపాలిటన్ నగరాలుగా గుర్తించింది. ఈ జాబితా ప్రకారం నేరాల సంఖ్యలో హైదరాబాద్ 10వ స్థానంలో నిలిచింది.

# ఆర్థిక మోసాల భాగ్యనగరం

హైదరాబాద్: ఆర్థిక నేరాలు ముంబయి తర్వాత భాగ్యనగరంలోనే అత్యధికంగా నమోదవుతున్నాయి. ఇతర నగరాలతో పోలిస్తే ఏటా పెరుగుదల రేటు అత్యధికంగా కనిపిస్తోంది. 2022లో ముంబయిలో 6,960, హైదరాబాద్‌లో 6,015 కేసులు నమోదయ్యాయి. ఈ తరహా కేసుల్లో పూర్తి ఆధారాలతో ఛార్జిషీటు దాఖలు చేయడంలో పోలీసులు పూర్తిగా వెనుకబడ్డారు. 6,015 కేసులకు కేవలం 38.2 శాతమే ఛార్జిషీట్లు సమర్పించారు. ఆర్థిక నేరాల్లో ఎక్కువగా ఫోర్జరీ, నమ్మకద్రోహం వంటివి 90 శాతం ఉన్నట్లు ఎన్‌సీఆర్‌బీ డేటా-2022 వెల్లడించింది. నమోదైన వాటిలో 2,956 కేసులకు ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని ప్రస్తావించింది. ఆర్థిక నేరాల్లో రాజీ అవుతున్నది ఎక్కువగా హైదరాబాద్‌లో జరుగుతోంది. గతేడాది 1,328 కేసుల్లో రాజీ కుదిరింది. ఇతర నగరాలేవీ భాగ్యనగరం దరిదాపుల్లో కూడా లేవు.

సైబర్ నేరాల్లో మూడోస్థానం: సైబర్ నేరాల్లో నగరం మూడోస్థానంలో నిలిచింది. బెంగళూరు(9,940), ముంబయి(4,724), హైదరాబాద్(4,436) వరుసగా ఉన్నాయి. 19 మెట్రో నగరాల్లో ఈ స్థాయిలో సైబర్ నేరాలు ఎక్కడా నమోదవడం లేదు. సైబర్ నేరాల్లో పూర్తి ఆధారాలతో 25.4 శాతమే ఛార్జిషీట్లు దాఖలు చేశారు.



సైబర్ నేరాల్లో ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఉపయోగించడం ద్వారా 3,719 మోసాలు చోటుచేసుకున్నాయి. ఇలాంటివి మనవద్దే ఎక్కువ జరుగుతున్నాయి.

ఏటీఎం మోసాలు 198, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు- 2,456, ఓటీపీ మోసాలు- 667 నమోదయ్యాయి. ఈ మోసాలు దేశంలోనే అత్యధికంగా ఇక్కడ జరుగుతున్నాయి.

189 ఘటనల్లో మహిళలు, చిన్నారులు లైంగిక వేధింపుల ఎదుర్కొన్నారు. 171 ఘటనలు బెదిరింపులు(బ్లాక్‌మెయిలింగ్) నమోదయ్యాయి.

ప్రస్తుతం నగర పరిధిలో 7,991 సైబర్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 2,390 నేరాల్లో ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు.

మోసం, సంతకాల ఫోర్జరీ తదితర కేసులు అత్యధికంగా ఇక్కడే నమోదయ్యాయి. 2022లో మొత్తం 2,365 ఘటనల్లో 2,366 మంది మోసపోయారు. నగరంలో నమోదయ్యే ఆర్థిక నేరాల్లో ఎక్కువ వాటా వీటిదే ఉంది. 19 మెట్రో నగరాల్లో 8,865 కేసులు రికార్డవగా అందులో 25 శాతానికిపైగా ఇక్కడివే.

సెక్షన్ 420 కింద నమ్మకద్రోహం కేసుల్లోనూ మనమే టాప్‌లో ఉన్నాం. 3,414 కేసుల్లో 3,434 మంది మోసపోయారు. రెండోస్థానంలో ముంబయి(3,277), దిల్లీ 2,884 ఉన్నాయి.

# నిధుల కొరత.. చెల్లింపులు నిలిపివేత!

భువనగిరి : భువనగిరి పురపాలక సంఘం కార్యాలయంలో నిధుల కొరత నెలకొంది. గత కొద్ది నెలలుగా రావాల్సిన ఆదాయం మందగించింది. ప్రస్తుతం కనీసం కార్మికుల వేతనాలు చెల్లించేందుకు సరిపడా నిధులు లేకపోవడంతో ఇప్పటి వరకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఉంది. మున్సిపాలిటీకి ప్రతి నెలా ఆస్తి పన్ను, నీటి బిల్లులు, నిర్మాణాల అనుమతులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల ద్వార స్థానికంగా ఆదాయం లభిస్తుంది. ఆయా మార్గాల ద్వార లభిస్తున్న ఆదాయంపైనే మున్సిపాలిటీ నిర్వహణ, కార్మికుల వేతనాలు చెల్లిస్తుంటారు. ఎన్నికలు, ఇతర కారణాలతో స్థానికంగా ఆదాయం సమకూరని కారణంగా గత రెండు నెలలుగా ప్రతి నెలా చెల్లించాల్సిన బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. ఈ నెల కార్మికులకు ఇచ్చేందుకు డబ్బులు లేకపోవడంతో పట్టణంలోని గ్లాస్ ప్యాక్ చెల్లించాల్సిన ఆస్తిపన్ను రూ.30లక్షలు వసూలు చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ ద్వార సమకూరనున్న మరో రూ.10లక్షలు కలిపి కార్మికుల వేతనాలు చెల్లించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తుండటం గమనార్హం.

ఖర్చులు ఇలా...నిర్వహణ ఎలా...



మున్సిపాలిటీ నిర్వహణకు ప్రతి నెలా సుమారు రూ.1.78 కోట్లు అవసరమవుతాయి. ఆశించిన మేరకు ఆస్తిపన్ను, నల్లా నీటి బిల్లులు, ఇతర మార్గాల ద్వార రావాల్సిన ఆదాయం మందగించింది. ఏటా ఆదాయం డిమాండ్ రూ.11 కోట్లు ఉండగా, ఇప్పటి వరకు ఇందులో 30 శాతం వరకు వసూళ్లు జరిగాయి. ప్రస్తుతం ప్రతి నెలా కార్మికుల వేతనాల కోసం సుమారు రూ.48 లక్షలు, విద్యుత్తు బిల్లు చెల్లింపులకు రూ.14 లక్షలు, మెట్రో నీటి సరఫరాకు రూ.14లక్షలు, డీజిల్‌కు రూ.6 లక్షలు, నీటి సరఫరా, ఇతర మరమ్మతులకు రూ.8లక్షలు, సమావేశం జరిగిన సందర్భంలో గౌరవ వేతనం కోసం రూ.1.45లక్షలు కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం గత రెండు నెలలుగా విద్యుత్తు బిల్లు, నీటి సరఫరా బిల్లుతోపాటు పలు రకాల చెల్లింపులు నిధుల కొరతతో నిలిచిపోయాయి. పన్ను వసూళ్లు పుంజుకునే వరకు ఆయా చెల్లింపులకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో మున్సిపల్ నిర్మాణం ఎలా చేపడతారో వేచిచూడాల్సిన అవసరం ఉంది.

ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి వివరణ కోరగా కార్మికుల వేతనాలు చెల్లిస్తామని అన్నారు. ఎన్నికలు, ఇతర కారణాల వల్ల వసూళ్లు జరగలేదని అన్నారు. సోమవారం నుంచి బకాయి వసూళ్లపై దృష్టి సారించామని, లక్ష్యం మేరకు పన్ను వసూళ్లతో పాటు ఇతర ఆదాయం వసూలు చేస్తామన్నారు.

# కొలువుదీరనున్న నూతన ప్రభుత్వం.. కీలక విభాగాలకు త్వరలో కొత్త బాసులు!




హైదరాబాద్: తెలంగాణలో త్వరలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్న నేపథ్యంలో గ్రేటర్ పరిపాలనలో కీలకమైన విభాగాల్లో మార్పులు చేర్పులు జరగనున్నాయి. ప్రస్తుతం ఉన్న అధికారులకు స్థానచలనం జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం ఏర్పాటు తర్వాత వారంలో ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. నగరాభివృద్ధిలో జీహెచ్ఎంసీ, జలమండలి, హెచ్ఎండీఏలదే ప్రధాన పాత్ర. రూ.వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులు ఆయా ప్రభుత్వ విభాగాల పరిధిలో జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం పట్ల ఒక సానుకూలత రావాలంటే రాజధాని హైదరాబాద్‌లో మౌలిక వసతుల దగ్గర నుంచి పాలన వ్యవహారాల్లో పారదర్శకత చాలా అవసరం. ముఖ్యంగా నీటి సరఫరా, మురుగు నీటి, పారిశుద్ధ్య నిర్వహణ, ప్లానింగ్ లాంటి అంశాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాల్సిందే.

హెచ్ఎండీఏకు పూర్తిస్థాయి కమిషనర్!

ప్లానింగ్‌లో కీలకమైన హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ)కు పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం మున్సిపల్‌శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ హెచ్ఎండీఏ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. అక్కడా ఇక్కడా విధుల నిర్వహణలో సమన్వయం ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి. ఏదైనా కీలకమైన సమీక్ష సమావేశం ఉంటే తప్పా...పూర్తిస్థాయిలో హెచ్ఎండీఏపై దృష్టి సారించక పోవడంతో కిందిస్థాయి అధికారులు, సిబ్బంది ఆడిందే ఆటగా సాగుతోంది. ముఖ్యంగా హెచ్ఎండీఏ పరిధిలో వేల కోట్ల విలువైన భూములు ఉన్నాయి. ఇప్పటికే కొన్ని వేలం ద్వారా విక్రయించారు. మరికొన్ని వేలం వేసే క్రమంలో ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఏడు జిల్లాల పరిధిలో కొన్ని భూములు ఆక్రమణల పాలవుతున్నాయి. శంషాబాద్‌లో ఇటీవలి ఓ నేత 50 ఎకరాలు హెచ్ఎండీఏ స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేసినా..ఆఖరి వరకు అధికారులు గుర్తించలేకపోయారు. పలు ఫిర్యాదుల నేపథ్యంలో చివరిలో అడ్డుకున్నారు. ఇలాంటివి జరుగుతూనే ఉన్నాయి. ప్రణాళిక విభాగంలో అధికారులు, సిబ్బంది పనితీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో కొన్నాళ్లుగా హెచ్ఎండీఏలో పాలన గాడి తప్పిందనే విమర్శలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వం రానున్న దృష్ట్యా హెచ్ఎండీఏకు నూతన కమిషనర్‌ను నియమించే అవకాశం ఉంది.

పోలీస్ శాఖలో..

జలమండలి ఎండీగా దానకిషోర్ బాధ్యతలు చేపట్టి ఆరేళ్లు దాటింది. అవుటర్ చుట్టూ ఉన్న గ్రామాలకు తాగునీరు అందించడం.. నగరంలో మురుగు నీటి శుద్ధి జరిగేలా కొత్తగా 31 మురుగు శుద్ధి కేంద్రాల నిర్మాణం...ఇతరత్రా అభివృద్ధి పనుల్లో తనదైన ముద్ర వేశారు. ఇక్కడి నుంచి ఆయన్ను బదిలీ చేసి కీలక విభాగాల్లో సేవలను ఉపయోగించుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇక బల్దియా కమిషనర్‌గా రోనాల్డ్ రాస్ ఎన్నికల ముందే బాధ్యతలు చేపట్టడంతో ఆయన్నే కొనసాగిస్తారో లేదో కొద్దిరోజుల్లో స్పష్టత రానుంది. మూడు పోలీసు కమిషనరేట్లలో కూడా బదిలీలకు అవకాశం ఉంటుందని అంటున్నారు. ఎన్నికల సమయంలో సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఆయన బదిలీ ఉంటుందని సమాచారం. నగర కమిషనర్ సందీప్‌శాండిల్య ఎన్నికల సమయంలో వచ్చారు. రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ కూడా ఏడాది కిందటే వచ్చారు. వీరిరువురిని కొనసాగిస్తారా? లేదా అనేది వేచి చూడాలి. నగర ట్రాఫిక్ విభాగం అదనపు కమిషనర్ సుధీర్‌బాబు ఏడాది కిందటే వచ్చారు. ఆయన్ను బదిలీ చేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

# వినియోగదారుల పరిరక్షణ చట్టం



హైదరాబాద్: వినియోగదారుల పరిరక్షణ చట్టాన్ని కొందరు సొంత ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారు. డిస్మిస్ చేసిన కేసులను ఇతర కమిషన్లలో మరోసారి దాఖలు చేసి పరిహారం పొందే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఓ ఇన్సూరెన్స్ క్లెయిమ్ తిరస్కరణ కేసులో పరిహారం ఇవ్వాలని తీర్పు వెలువరించినా మరోసారి అదే పాలసీపై వేర్వేరు సాక్ష్యాలతో కేసు నమోదు చేసిన ఘటన ఇటీవల వెలుగు చూసింది.కేసులు వేయడమే పని... వినియోగదారుల పరిరక్షణ దృష్ట్యా జిరాక్స్ రశీదులను సాక్ష్యాలుగా స్వీకరించే వెసులుబాటు ఉండటంతో కొందరు ఇదే అదునుగా స్వలాభం కోసం వాడుకుంటున్నారు. ఓ ప్రయివేటు ఉద్యోగి ఏకంగా మూడు కమిషన్లలో వేర్వేరు కేసులు నమోదు చేసి బురిడి కొట్టించే ప్రయత్నం చేశాడు. ఏ కేసులోనైనా విజయం సాధిస్తే వినియోగదారుడు నష్టపోయిన దాంతో పాటు పరిహారం, కేసు ఖర్చులు కలిపి రూ.10వేలకు తగ్గకుండా ఇవ్వాలంటూ ఆదేశించిన దాఖలాలుండటంతో..కేసులు వేయడం పరిపాటిగా మార్చుకున్నాడు. అతనే అన్ని కేసుల్లో వినియోగదారుడిగా మారి జిరాక్స్ పత్రాలనే సాక్ష్యాలుగా చూపుతూ హైదరాబాద్‌లోని మూడు కమిషన్లలో వేర్వేరు కేసులు దాఖలు చేశాడు. ఒక్కో కమిషన్‌లో ఒకరికి బదులు మరొకరిని ప్రతివాదులుగా చూపాడు. రశీదులోని పేరుకు భిన్నంగా వేరే ప్రతివాదులపై ఫిర్యాదు నమోదు చేయడాన్ని గుర్తించిన కమిషన్ ఆ కేసును డిస్మిస్ చేసింది. వెంటనే అదే రశీదుతో మరో కమిషన్‌లో కేసు వేయగా అక్కడా ఆ రశీదును సభ్యులు గుర్తించడంతో అడ్డంగా దొరికిపోయాడు.

బీమా క్లెయిమ్‌లలో అవకతవకలు

ఓ వ్యక్తి మరణాన్ని ఆసరాగా తీసుకొని ఓ ప్రముఖ పార్టీ సభ్యుడిగా మార్చేసి, నకిలీ రశీదులు సృష్టించి క్లెయిమ్‌ల కోసం అర్జీలు పెట్టుకుంటున్న ఘటనలూ ఉన్నాయి. గోదావరిఖనికి చెందిన వేణు అనే వ్యక్తి 2017 ఫిబ్రవరిలో ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మరణించాడు. దీంతో పరిహారం ఇప్పించాలంటూ ఓ ప్రయివేటు గ్రూపు ఇన్సూరెన్స్ సంస్థను బాధితులు ఆశ్రయించారు. సరైన ఆధారాలు లేవని ఆ సంస్థ క్లెయిమ్‌ను తిరస్కరించింది. తర్వాత కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్‌లో ఆధారాలను పరిశీలించగా..క్లెయిమ్ దరఖాస్తు తేదీ, పాలసీ ఎప్పుడు చేయించారో పేర్కొనకపోవడం, దానికి జత చేసిన సభ్యత్వ సర్టిఫికేట్‌లో నమోదు తేదీ.. అతను మరణించిన నెల రోజుల తర్వాత 2017 ఫిబ్రవరిలో నమోదైనట్టు గుర్తించారు. దీంతో సభ్యులకు నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని కమిషన్ తీర్పులో సూచించింది.

# అడుగు దూరంలో గిరిజన విశ్వవిద్యాలయం

జయశంకర్ : రాష్ట్ర విభజన హామీల్లో ఒకటైన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం కల సాకారం కానుంది. అక్టోబర్ 1న పాలమూరులో ప్రధాని నరేంద్ర మోదీ గిరిజన యూనివర్సిటీకి ఆదివాసీల ఆరాధ్యదైవం సమ్మక్క,సారక్క పేరిట ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకటన ఇప్పుడు కార్యరూపం దాల్చనుంది. సోమవారం లోక్‌సభలో కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ బిల్లును కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ప్రవేశపెట్టారు. ఈ సమావేశాల్లోనే బిల్లు ఆమోదం పొందే అవకాశం ఉంది. దాదాపు తొమ్మిదేళ్ల కల సాకారం అవుతుండటంతో.. గిరిపుత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

337.16 ఎకరాల స్థలం గుర్తింపు

ఆరేళ్ల క్రితమే కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ, మానవ వనరుల అభివృద్ధి శాఖ, విశ్వవిద్యాలయాల ఉపకులపతుల బృందం ములుగులో పర్యటించి యూనివర్సిటీ కోసం ఇక్కడి స్థలాలను, సదుపాయాలను పరిశీలించింది. రెండేళ్ల క్రితమే స్థలానికి సంబంధించిన వివరాలను అందించారు. 163 జాతీయ రహదారికి ఆనుకుని ములుగు జిల్లా కేంద్రానికి సమీపంలోని గట్టమ్మ ఆలయానికి దగ్గరలోని 337.16 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి నుంచి జులైలో సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ విభాగానికి లేఖలు రాశారు. విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కేంద్రం అన్ని చర్యలు తీసుకుంటోంది. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన తర్వాత చకచకా పనులు పూర్తి కానున్నాయి. వచ్చే ఏడాది నుంచి తరగతులు నిర్వహించే అవకాశం ఉంది.

వనదేవతల పేరుతో..

కేంద్రీయ జాతీయ గిరిజన యూనివర్సిటీకి ఆదివాసీ ఆరాధ్య వన దేవతలు సమ్మక్క-సారలమ్మల పేరు నామకరణం చేశారు. ఆసియాలోనే అతిపెద్దదైన మేడారం జాతరకు ప్రత్యేకత ఉంది. యూనివర్సిటీకి అమ్మవార్ల పేర్లను పెట్టడంతో మేడారం జాతర మరింత ప్రాచుర్యం పొందనుంది.

గిరిజన విద్యార్థులకు వరం..

గిరిజన విద్యార్థులకు ఈ విశ్వవిద్యాలయం వరంలా మారనుంది.



ఈ ప్రాంతంతో పాటు రాష్ట్రంలోని గిరిపుత్రులకు ఉన్నత విద్య చేరువకానుంది. ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశాలుండి, దూరప్రాంతాలకు వెళ్లలేక ఉన్నత చదువులకు గిరిజన విద్యార్థులు దూరమవుతుంటారు. ఇక్కడ ఏర్పాటుతో వారికి సదావకాశమే. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు వస్తారు. ఆయా ప్రాంతాల గిరిజన సంస్కృతి సంప్రదాయాలు, గిరిజన కళలు, సాంస్కృతి, తదితర విషయాలపై పరిశోధనలు చేసే అవకాశం కలుగుతుంది. నూతన సాంకేతిక కోర్సులు అందుబాటులోకి వస్తాయి.

జిల్లాకు మరో మణిహారం..

పర్యాటకంలో ములుగు జిల్లాకు ఎంతో గుర్తింపు దక్కింది. ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన సమ్మక్క సారలమ్మ మేడారం జాతర, యునెస్కో గుర్తింపు దక్కిన రామప్ప ఆలయం, లక్నవరం, బొగత లాంటి ప్రముఖ పర్యాటక కేంద్రాలు, సమ్మక్క సాగరం, దేవాదుల ప్రాజెక్టు, హేమాచల నరసింహస్వామి ఆలయం, ప్రకృతి ఒడిలో ఉన్నట్లుగా ఉండే పచ్చని అడవులు, ఇలా ఎన్నో ప్రత్యేకతలున్న ములుగు జిల్లాలో మరో మణిహారంగా కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం చేరనుంది.

# డిజిటల్ ప్రచారం.. విజయతీరం


హైదరాబాద్: గ్రేటర్‌లో అభ్యర్థుల గెలుపు ఓటముల్లో సామాజిక మాధ్యమాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. సోషల్ మీడియా ప్రచారంలో భారాస, భాజపాలు ముందు వరుసలో నిలిచాయి. భాజపా సైతం అనేక ప్రాంతాల్లో భారీగా ఓట్లను సంపాదించింది. ఇంటింటి ప్రచారంతో పాటు సోషల్ మీడియాపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయా పార్టీల అభ్యర్థులు.. డిజిటల్ ప్రచారంలో యువ ఓటర్లను తమ వైపు తిప్పుకోవడంలో అనుకున్న స్థాయిలో ఫలితాలను రాబట్టారు. సోషల్ మీడియా వార్‌రూమ్‌లను ఏర్పాటు చేసి షిఫ్టులవారీగా సిబ్బందిని నియమించారు. నియోజకవర్గాల వారీగా సమస్యలను వివరిస్తూ, అభివృద్ధి చేసిన ప్రాంతాలను చూపుతూ, ప్రచారంలో నోరు జారిన నేతల వ్యాఖ్యలను వైరల్ చేశారు. వేర్వేరు నినాదాలతో సామాజిక మాధ్యమాల్లో ప్రచారం హోరెత్తించి జనాల్లో చర్చ జరిగేలా సఫలీకృతమయ్యారు. సామాజిక మాధ్యమాల ఖాతా తెరిస్తే చాలు.. ఆయా పార్టీల ప్రకటనలు ప్రత్యక్షమయ్యేలా, నిత్యం జనాల్లో ఉండేలా పార్టీలు తీవ్రంగా ప్రయత్నించాయి. భారాస యూట్యూబ్, ట్విటర్(ఎక్స్), ఫేస్‌బుక్‌ల ద్వారా ప్రచారం సాగించింది. 'అభివృద్ధి




మంత్రం' పేరుతో చేసిన ప్రకటనలు రూపొందించి, నిత్యం జనాల్లో తిరిగేలా ప్రణాళికలు వేసి విజయం సాధించారు. అభ్యర్థులు 'వేలికి ఇంకు.. గెలిచేది పింకు' అంటూ భారాస అభ్యర్థులు నేరుగా చేసిన ప్రచారాన్ని జనాల్లోకి తీసుకెళ్లడంలో శ్రేణులు సఫలమయ్యాయి. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ తారలతో భారాస చేపట్టిన ప్రచారం గ్రేటర్‌లో సత్ఫలితాలను ఇచ్చింది. హైదరాబాద్ నగరంలోని వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి, టీహబ్, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు చేపట్టిన పైవంతెనలు, తీగల వంతెన, నానక్‌రామ్‌గూడలో ఆకాశహర్మ్యాలు చూపుతూ సోషల్ మీడియాలో ప్రచారం సాగించారు. దీనిని సమర్థంగా తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ చివరి క్షణం వరకు తీవ్రంగా ప్రయత్నించినా.. అనుకున్న మేర ఫలితం రాబట్టలేకపోయింది.

# శిక్షణ విహంగాలు.. విషాదగీతికలు

హైదరాబాద్: శిక్షణ విమానాలు కుప్పకూలుతున్న ఘటనలు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే సాంకేతిక లోపం తలెత్తి క్రాష్‌ల్యాండింగ్ అవుతున్నాయి. ఈ ఘటనల్లో చాలా మంది పైలెట్లు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కి చెందిన శిక్షణ విమానం మెదక్ జిల్లా తుప్రాన్‌లోని రావెల్లి శివారులో కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు పైలెట్లు దుర్మరణం పాలయ్యారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఎక్స్(ట్విట్టర్)లో పేర్కొంది. గతంలో బోయిన్‌పల్లిలోని నివాస గృహాల మధ్య ఓ శిక్షణ విమానం కుప్పకూలి నలుగురు పైలెట్లు మృతి చెందిన విషయం తెలిసిందే. తరచూ జరుగుతున్న ఘటనలతో నగరవాసులు



ఆందోళన చెందుతున్నారు.

రోజూ 50కి పైగా విమానాల్లో శిక్షణ..

రాజధాని పరిధిలో హకీంపేట, దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలు, నాదర్‌గుల్, బేగంపేట ఎయిర్‌పోర్టు పరిధిలోని ప్రైవేటు అకాడమీల్లో పైలెట్ శిక్షణ అందిస్తున్నారు. రోజూ సుమారు 50కి పైగా విమానాల్లో ట్రైనీ పైలెట్లు వీటిల్లో శిక్షణ పొందుతున్నారు. ఫ్లైయింగ్ అవర్స్ పెంచుకునే క్రమంలో సాంకేతిక లోపం తలెత్తుతుండటంతో పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నంలో, బయటపడే మార్గంలేక ప్రాణాలు వదులుతోన్నారు.ఆరేళ్ల క్రితం హాకీంపేట నుంచి ఎగిరిన శిక్షణ విమానం కిరణ్‌మాక్-2 ఎయిర్‌క్రాఫ్ట్‌లో కొద్దిసేపటికే సాంకేతికలోపం తలెత్తి కుప్పకూలింది. కీసర మండలం అంకిరెడ్డిపల్లిలో ప్రమాదాన్ని ముందే పసిగట్టి అప్రమత్తమైన పైలెట్ పారాచూట్ సహాయంతో ప్రమాద ప్రాంతానికి మూడు కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో సేఫ్‌ల్యాండ్ అయ్యారు.2018 నవంబరు 21న రాజీవ్‌గాంధీ ఏవియేషన్ అకాడమీకి చెందిన ఓ ప్రైవేటు శిక్షణ విమానం ప్రమాదానికి గురైంది. చెట్టుకు తగిలి మొకిలా గ్రామంలోని పొలంలో కుప్పకూలింది. పైలెట్‌స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

# ఇక.. ఉగ్గబట్టుకోనక్కర్లేదు..!

ఖమ్మం : గాంధీచౌక్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 1,050 మంది బాలికలం చదువుకుంటున్నాం. ఉన్నవి 8 మరుగుదొడ్లు. ప్రస్తుతం పనిచేస్తున్నవి నాలుగు. ఇవికాక విద్యార్థినుల సంఖ్యకు అదనంగా మరికొన్ని నిర్మించాల్సి ఉంది. ఒంటికీ, రెంటికీ ఎంతో ఇబ్బందులు పడుతున్నాం. కొత్త మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభించాలి.'

కళాశాల విద్యార్థిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 450 మంది బాల, బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. అవసరానికి తగినన్ని మరుగుదొడ్లు లేక వారు ఇబ్బందులు పడుతున్నారు. బాలురు దూరంగా నిర్మానుష్య ప్రాంతాలకు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకోవాల్సి వస్తోంది.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో

స్వచ్ఛత, పరిశుభ్రత మెరుగు పరిచేందుకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. పలు కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ఫలితంగా బాల, బాలికలు ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలిసిందే. ఆయా కళాశాలల ప్రధానాచార్యులు సమస్యల్ని పలుమార్లు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఇంటర్మీడియట్ విద్యా




శాఖ కార్యదర్శి నవీన్ మిత్తల్ స్పందించారు. బాల, బాలికలకు వేర్వేరుగా కావాల్సిన మరుగుదొడ్ల సముదాయాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేస్తూ తాజాగా ఆదేశాలు జారీచేశారు. కళాశాలలకు నిర్వహణ ఖర్చులూ విడుదల చేశారు.

నిర్వహణకు వెసులుబాటుప్రస్తుత విద్యా సంవత్సరంలో జూన్ 1వ తేదీ నుంచి కళాశాలలు ప్రారంభమయ్యాయి. అప్పట్నుంచి నిర్వహణకు చేతిలో నిధుల్లేక ప్రధానాచార్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధిగమిం చేందుకు ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.71 చొప్పున కళాశాలలకు ఇటీవల మంజూరు చేసింది. ఖమ్మం జిల్లాకు రూ.3,38,599, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రూ.3,01,750 విడుదలయ్యారు. ఈ నిధులలో స్టేషనరీ, చిన్నపాటి మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, వేడుకలు, సమావేశాల ఖర్చులు వెచ్చిస్తారు.

దేనికెంత?విద్యార్థుల సంఖ్య ఆధారంగా కళాశాలల్లో మరుగుదొడ్లు నిర్మించనున్నారు. ఒక సముదాయానికి రూ.4.60 లక్షలు, రెండింటికి రూ.9.20 లక్షలు, మూడింటికి 13.80 లక్షలు, నాలుగైతే 18.40 లక్షలతో నిర్మిస్తారు. ఒక సముదాయంలో నాలుగు దొడ్లు ఉంటాయి. వీటిని వేగంగా నిర్మించి నిర్వహణ చేపడితేనే బాధలు తప్పుతాయి.

# మున్నేరు.. ఆక్రమణల జోరు

ఖమ్మం : నది ఉప్పొంగి ప్రవహించినప్పుడు ఎక్కడి వరకు వరద నీరు వస్తుందో అధికారులు గుర్తించి ఆ ప్రాంతాన్ని బఫర్ జోన్‌గా నిర్ణయిస్తారు. ఈ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. కానీ ఖమ్మం నగరం నడిబొడ్డున ఉన్న మున్నేరు ఉప నది బఫర్ జోన్‌లో ఏకంగా స్థిరాస్తి వెంచర్లు వెలిశాయి. కొంతమంది అధికారులు మామూళ్ల మత్తులో నిర్మాణాలకు అనుమతులివ్వడం, రిజిస్ట్రేషన్లు కొనసాగడంతో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మరికొంత మంది అనుమతులు లేకుండానే నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. నిర్మాణాల అనంతరం రాజకీయ ఒత్తిళ్లతో నగరపాలక సంస్థ, పంచాయతీ అధికారులు వాటికి ఇళ్ల నెంబర్లు కేటాయించడం, ఆ తరువాత ఇతర వసతులు కల్పించడంతో అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఇటీవల మున్నేరుకు 30 అడుగుల వరద వచ్చిన నేపథ్యంలో ఎంత వరకు బఫర్ జోన్ అన్న విషయం చర్చకు రావడం విశేషం. 2008లో 25.60 అడుగులు వచ్చిన మున్నేరు వరద గత నెల 30.70 అడుగుల మేర ప్రవహించింది. ఈ ప్రవాహానికి ఖమ్మం నగరంలో 1,723, ఖమ్మం గ్రామీణ మండలంలో 502 ఇళ్లు నీట మునిగాయి.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

మున్నేరుకు ఒక వైపున ఖమ్మంనగరం, మరో వైపు ఖమ్మం గ్రామీణ మండలం ఉన్నాయి. రెండువైపులా మున్నేరు ఒడ్డున నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేసి తక్కువ ధరలకు స్థలాల అమ్మకం చేయడం, ఇళ్ల నిర్మాణం చేపట్టడం సర్వసాధారణంగా మారిపోయింది. బఫర్‌జోన్(నది పరిధిలోని ఒడ్డు)లో పట్టా భూమి ఉన్నా అందులో వ్యవసాయం చేసుకోవాలి తప్ప ఎటువంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేదు. కానీ పట్టా భూమితో పాటుగా ప్రభుత్వ భూములను ఆక్రమించి వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ అక్రమ వెంచర్లలో గోడలు, తారు రోడ్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. మున్నేరుకు ఇరువైపులా బఫర్ జోన్‌లోనే శ్మశాన వాటికల నిర్మాణాలు సైతం చేపట్టారు, వాటికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేసింది. గతంలో మున్నేరు ఆక్రమణ గురించి ఎంతోమంది ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం వచ్చిన వరదలతో అధికారులు హడావుడి చేస్తున్నారు. కానీ ఆక్రమణలు ఇకనైనా ఆగుతాయా, లేదంటే యథావిధిగా కొనసాగుతాయా చూడాలి.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తక్కువ ధరకు స్థలాలు వస్తున్నాయని కొంతమంది మధ్యతరగతి వారు ఇళ్లను కొనుగోలు చేసి నివాసాలు ఉంటున్నారు. ఇటీవల వచ్చిన వరదలకు ఇళ్లన్నీ నీట మునిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు ఆక్రమణదారులతో కుమ్మక్కై అక్రమ వెంచర్లలో రహదారుల నిర్మాణం, విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు ఇళ్లను కొనుగోలు చేశారు. వెంచర్ వేసిన వారు ప్లాట్లు విక్రయించి వాటిని సొమ్ము చేసుకొని వెళ్లిపోయారు. ప్రస్తుతం నివాసం ఉండే వారు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు.

నీట మునిగిన ప్రాంతాలు

ఖమ్మంనగరంలోని బొక్కలగడ్డ, మోతీనగర్, పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, అగ్రహారం, రామన్నపేట, సమ్మక్క సారక్క ఆర్చీ, జూబ్లీక్లబ్ వెనుక ప్రాంతం... ఖమ్మం గ్రామీణ మండలం పెద్దతండా పంచాయతీలోని జలగంనగర్, కేబీఆర్‌నగర్‌కాలనీ, పోలేపల్లి పంచాయతీలోని దివ్యాంగుల కాలనీ, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో మొత్తం 2,225 ఇళ్లు నీట మునిగాయి. 44 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి, 928లో ఇంట్లో సామగ్రి కొట్టుకుపోయింది.

# సింగరేణిలో డంపర్ టైర్ల కొరత



మణుగూరు : సింగరేణిలో వంద టన్నుల సామర్థ్యం కలిగిన డంపర్ల టైర్ల కొరత ఏర్పడింది. దీంతో ఓపెన్ కాస్ట్‌ల్లో డంపర్లు నిలిచిపోతున్నాయి. ఓపెన్ కాస్టలలో సింగరేణి సంస్థ ఓబీ, బొగ్గు రవాణాకు వంద టన్నుల సామర్థ్యం కలిగిన డంపర్లను వినియోగిస్తుంది. ఒక్కో డంపర్ 35 క్యూబిక్ మీటర్ల ఓబీని ఒక్కసారే వేరేచోటుకి రవాణా చేసి డంప్ చేయగలదు. అయితే గత రెణ్నెల్లుగా డంపర్లకు టైర్లు అందుబాటులో లేవు. ఆర్జీ ఓసీ- 3 గనిలో 13, మణుగూరు పీకే ఓసీ-2 గనిలో ఎనిమిది డంపర్లు టైర్లు లేక నిలిచిపోయాయి. డంపర్లు నిలిచిపోవటంతో ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతోంది.

ఒక్కో టైరు ధర రూ.9 లక్షలు

వంద టన్నుల డంపర్ల టైర్లని మిచ్‌లిమ్, జేకే టైర్, బ్రిడ్జి స్టోన్ కంపెనీలు తయారు చేస్తాయి. అయితే టైర్లలో రేడియల్, బయాస్ అనే రకాలు ఉంటాయి. బయాస్ రకంతో పోల్చితే రేడియల్ రకానివి నాణ్యంగా ఉంటాయి. ఈ రెండింటికి ధరల్లో వ్యత్యాసం కూడా ఉంది. రేడియల్ రకమైతే ఒక్కొక్కటి రూ.9 లక్షలు, బయాస్ రకమైతే రూ.4.50 లక్షల వరకు ఉంటాయి. పలు కంపెనీల టైర్లను సింగరేణి ప్రస్తుతం వినియోగిస్తోంది.

పలుమార్లు టెండర్ రీ ఫ్లోట్

వంద టన్నుల డంపర్లు అందించేందుకు సింగరేణి సంస్థ టెండర్ పిలిచింది. అయితే అదే టెండర్లను రీ ఫ్లోట్ చేసింది. దీంతో టైర్ల కొరత దేర్పడింది. ధరలు ఎక్కువగా ఉండటంతో తక్కువ కోట్ వచ్చేలా సింగరేణి ప్రయత్నించింది. కానీ ఆశించిన స్థాయిలో తక్కువ ధరకు టెండర్లు రాకపోవటంతో టెండర్లను రీ ఫ్లోట్ చేసి చేసింది. కోల్ ఇండియాలో డంపర్లకు ఏ టైర్లు వినియోగిస్తున్నారో తెలుసుకునేందుకు ఓ కమిటీని కూడా వేసింది. ఆ కమిటీ కోల్‌కతలో అధ్యయనం చేసి నివేదికను అందజేసింది.

వంద టన్నుల డంపర్లే ఎందుకంటే?

సింగరేణిలో 11, 15 క్యూబిక్ మీటర్ల షావెల్స్‌తో ఓబీని, బొగ్గును వెలికి తీస్తారు. ఈ షావెల్స్‌కి సరిపడా బొగ్గు, మట్టిని రవాణా చేస్తే సామర్థ్యం వంద టన్నుల డంపర్లకు మాత్రమే ఉంది. తక్కువ సామర్థ్యం గల డంపర్లను వినియోగిస్తే సంస్థకు సమయం, ఖర్చు రెండూ వృథా అవుతాయి.మణుగూరు ఏరియాలో టైర్లు లేక డంపర్లు ఆగాయి. డంపర్లు అదనంగా ఉన్నందున వాటిని వినియోగిస్తున్నాం. బొగ్గు ఉత్పత్తికి ఏ ఇబ్బంది లేదు. టైర్లు ఆర్డర్ పెట్టాం. రావాల్సి ఉంది. దుర్గం రామచందర్, జీఎం, మణుగూరు

# అభివృద్ధి పనులకు ప్రణాళిక




భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కసరత్తు సాగుతోంది. ఇప్పటికే ప్రగతిలో ఉన్నవాటిని ఉపయోగంలోకి తేవడంతో పాటు భవిష్యత్తు అవసరాలను గుర్తించి నూతన నిర్మాణాలకు చర్యలు చేపట్టారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనుమతి రాగానే త్వరలో రూ.కోట్ల విలువైన పనులు ఆరంభించాలని నిర్ణయించారు. రూ.42 కోట్లతో పర్యాటక శాఖ చేపట్టిన ప్రణాళికలో కోవెల ప్రాంగణంలో ఫ్లోరింగ్‌తో పాటు షెడ్ల రూపురేఖల్లో మార్పు రానుంది. ఈ పనులపై ఈవో రమాదేవి దృష్టి సారించారు.

జీఎమ్మార్ గ్రూప్స్ సహకారంతో..ఇటీవల జీఎమ్మార్ గ్రూప్స్ ఎయిర్‌పోర్ట్స్ ఛైర్మన్ జీబీఎస్ రాజు రామయ్యను దర్శించుకున్నారు. మాడ వీధుల మౌలిక సదుపాయాల గురించి అధికారులు ఆయనకు వివరించారు. మాడవీధికి షెడ్లను ఏర్పాటు చేయాలని, దీనివల్ల వర్షాకాలం, వేసవి కాలంలో తలెత్తే ఇబ్బందులను అధిగమించవచ్చని తెలిపారు. అందుకు ఆయన ఒప్పుకోవడంతో మ్యాప్‌ను సిద్ధం చేశారు. 16 అడుగుల ఎత్తులో మాడవీధి నుంచి నేరుగా అన్నదానం వరకు షెడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. భవిష్యత్తులో ఎలాంటి పనులు చేయాల్సి వచ్చినా ఈ నిర్మాణానికి ఇబ్బంది రాకుండా ప్రణాళిక రూపొందించారు.

భక్తులకు అదనపు సదుపాయాలు

ఆలయ కార్యాలయాన్ని తానీషా కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నారు. దీనికి సమీపంలో రూ.3.60 కోట్ల దాతల నిధులతో జానకీ సత్రాన్ని నిర్మిస్తున్నారు. గ్రౌండ్ ప్లస్ 2 పద్ధతిలో 30 గదులు ఇందులో ఉన్నాయి. నిధులు మిగిలితే ఇంకొన్ని గదులు ఇక్కడ ఏర్పాటు చేస్తారు. జానకీ సత్రానికి ఆనుకుని సౌమిత్రి సదనం ఉండడంతో ఈ రెండింటిని కలిపేందుకు మధ్యలో లిఫ్ట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వీటికి సమీపంలో తితిదే రూ.4.70 కోట్లతో నిర్మించిన కల్యాణ మండపం ఉంది. ఇక్కడ రూ.20 లక్షలతో ఫర్నిచర్‌ను తితిదే సమకూర్చనుంది.రామాలయానికి 3 కి.మీ. దూరంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం(ఏపీ)లో రాములవారికి భూములు ఉన్నాయి. ఇందులో 104 ఎకరాల్లో రెండు గోశాలలను నిర్మించారు. దీన్ని విస్తరించేందుకు పూర్తి స్థాయిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పుడున్న రెండు గోశాలలతో పాటు మరొకటి నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు రూ.60 లక్షలు అవసరం. దేవస్థానం నుంచి నిధులను ప్రతిపాదించినప్పటికీ దాతలను ఆహ్వానించనున్నారు.రంగనాయకుల గుట్టమీద ఉన్న అన్నవరం సత్రం, తితిదే సత్రాలు దెబ్బతినడంతో వీటిని పునరుద్ధరించాలని ప్రతిపాదించారు. ఆలయ వీఐపీ మార్గంలో పూర్తిస్థాయి పోలీసు అవుట్ పోస్టును ఏర్పాటు చేశారు. ప్రసాదాలు, నిత్యాన్నదానం నిమిత్తం వచ్చే సరకులను చిత్రకూట మండపంలోకి తీసుకెళ్లేందుకు వీలుగా అభివృద్ధి పనులు చేస్తున్నారు.

# రామాలయంలో అభివృద్ధి పనులకు ప్రణాళిక

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కసరత్తు సాగుతోంది. ఇప్పటికే ప్రగతిలో ఉన్నవాటిని ఉపయోగంలోకి తేవడంతో పాటు భవిష్యత్తు అవసరాలను గుర్తించి నూతన నిర్మాణాలకు చర్యలు చేపట్టారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనుమతి రాగానే త్వరలో రూ.కోట్ల విలువైన పనులు ఆరంభించాలని నిర్ణయించారు. రూ.42 కోట్లతో పర్యాటక శాఖ చేపట్టిన ప్రణాళికలో కోవెల ప్రాంగణంలో ఫ్లోరింగ్‌తో పాటు షెడ్ల రూపురేఖల్లో మార్పు రానుంది. ఈ పనులపై ఈవో రమాదేవి దృష్టి సారించారు.

జీఎమ్మార్ గ్రూప్స్ సహకారంతో...ఇటీవల జీఎమ్మార్ గ్రూప్స్ ఎయిర్‌పోర్ట్స్ ఛైర్మన్ జీబీఎస్ రాజు రామయ్యను దర్శించుకున్నారు. మాడ వీధుల మౌలిక సదుపాయాల గురించి అధికారులు ఆయనకు వివరించారు. మాడవీధికి షెడ్లను ఏర్పాటు చేయాలని, దీనివల్ల వర్షాకాలం, వేసవి కాలంలో తలెత్తే ఇబ్బందులను అధిగమించవచ్చని తెలిపారు. అందుకు ఆయన ఒప్పుకోవడంతో మ్యాప్‌ను సిద్ధం చేశారు. 16 అడుగుల ఎత్తులో మాడవీధి నుంచి నేరుగా అన్నదానం వరకు షెడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. భవిష్యత్తులో ఎలాంటి పనులు చేయాల్సి వచ్చినా ఈ నిర్మాణానికి ఇబ్బంది రాకుండా ప్రణాళిక రూపొందించారు.అదనపు సదుపాయాలు..ఆలయ కార్యాలయాన్ని తానీషా కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నారు. దీనికి సమీపంలో రూ.3.60 కోట్ల దాతల నిధులతో జానకీ సత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక్కడకు సమీపంలో తితిదే రూ.4.70 కోట్లతో నిర్మించిన కల్యాణ మండపం




ఉండగా.. ఆ సంస్థ మరో రూ.20 లక్షలతో ఫర్నిచర్‌ను సమకూర్చనుంది.రామాలయానికి 3 కి.మీ. దూరంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం(ఏపీ)లో రాములోరి భూములున్నాయి. అక్కడ రెండు గోశాలలున్నాయి. వీటికి తోడు మరొకటి నిర్మించనున్నారు. ఇందుక్కావాల్సిన రూ.60 లక్షలను దేవస్థానం నిధులతో పాటు దాతల విరాళాలుసేకరిస్తారు.

# ఇంటి నెంబర్లు సృష్టిస్తున్నారు..

జనగామ : ఆస్తి దక్కించుకోవడానికి చేయని ప్రయత్నం లేదు. చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకుని కొత్త దారులను అన్వేషిస్తున్నారు. ఖాళీ స్థలానికి, అనుమతి లేని, సరైన పత్రాలు లేని ఇళ్లకు అడ్డదారిలో ఇంటి నెంబర్లు సృష్టిస్తున్నారు. అలా ఇంటి నెంబర్ వస్తుందో లేదో వెంటనే రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. ఇంటి నెంబర్లు కేటాయించే మున్సిపల్ సిబ్బందికి అదనపు ఆదాయం వస్తుండటంతో తూతూ మంత్రంగా ప్రక్రియను ముగించేస్తున్నారు. ఈ అక్రమ బాగోతంపై అందిస్తున్న ప్రత్యేక కథనం..

కబ్జాకు ఇదో మార్గం

ఇంటి నెంబర్ల కోసం ఎక్కువగా ఆరాటపడేది నోటరీ ధ్రువపత్రాలు కల్గిన వారే.. నోటరీ ద్వారా రిజిస్ట్రేషన్ కానందున.. ఇంటినెంబర్లు తీసుకుని ఆ ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ఇదే అదనుగా దొంగ నోటరీ పత్రాలు పుట్టిస్తున్నారు. దీని ఆదారంగా ఇంటి నెంబర్ తీసుకోవడం, రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వేగంగా జరుగుతున్నాయి. ఆ వెంటనే ఆ స్థలాన్ని కబ్జా చేసేస్తున్నారు. అసలు యజమానికి తెర వెనుక ఏం జరిగిందో తెలియకముందే కబ్జాదారులు భూమిపై నిర్మాణాలు చేపడుతున్నారు. వివాదాస్పద భూమిగా మార్చి సెటిల్‌మెంట్ దందాకు దిగుతున్నారు. భూముల ధరలు విపరీతంగా పెరగడంతో కాస్త పలుకుబడిని పెట్టుబడిగా పెట్టి ఈ దందా కానిచ్చేస్తున్నారు.



ఒక్కొక్కరి నుంచి వేల రూపాయలు..

జనగామ పురపాలిక పరిధిలో దశాబ్దాల క్రితం స.నెం.53/1లో సుమారు 200 ఎకరాల్లో పెద్దఎత్తున బడుగు బలహీన వర్గాలకు, ఇందిరమ్మ కాలనీలో, 1957లో చేనేత కార్మికుల కోసం 18.33 ఎకరాల్లో లేఅవుట్ వేసి సొసైటీ ఆధ్వర్యంలో 100 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. 100 - 400 చ.గజాల స్థలాలు పొందారు. శక్తి మేరకు కొందరు ఇళ్లు కట్టుకున్నారు. ఇల్లు కట్టగా మిగిలిన స్థలాన్ని సొంత అవసరాలకు అట్టే పెట్టుకున్నారు. ఉన్న స్థలాన్ని వారసులకు పంపిణీ చేసి రిజిస్టర్ చేయలేకపోతున్నారు. నాయకులు, దళారులు రంగ ప్రవేశం చేసి ముందుగా ఇంటినెంబర్ల కేటాయింపు జరిగేలా చక్రం తిప్పుతున్నారు. ఇల్లు లేకపోయినా, ఉన్నట్లు ఇంటి నెంబర్ల కేటాయింపులు జరుపుతున్నారు. ఆ ఇంటి నెంబర్, పన్ను రశీదుతో రిజిస్ట్రేషన్లు చేసుకుని ఆస్తిమార్పిడి చేయించుకుంటున్నారు. ఈ వ్యవహారంలో ఒక్కొక్కరి నుంచి రూ.5-10వేలు మున్సిపాలిటీ సిబ్బంది, రూ.25,000-40వేలు రిజిస్ట్రేషన్ ఉద్యోగులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మున్సిపల్, రిజిస్ట్రేషన్ శాఖల ఉద్యోగులకు ఈ వ్యవహారం మంచి ఆదాయ వనరుగా మారింది. ఆయా కాలనీల్లో మిగులు స్థలాలను ఇంటి నెంబర్ల ఆధారంగా కబ్జా చేస్తున్నారని పెద్దఎత్తున ఆరోపణలు ఉన్నాయి.

అక్రమాలకు తావు లేదు- రజిత, మున్సిపల్ కమిషనర్

సరైన పత్రాలు లేకుండా ఇంటి నెంబర్ల కేటాయింపు జరగడానికి ఆస్కారం లేదు. అసెస్‌మెంట్ల విషయంలో అక్రమాలకు తావు లేకుండా చూస్తాం. చట్టపరమైన ఆటంకాలు ఉన్నవాటి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటాం.

# పెరుగుతున్న ఆయిల్‌పామ్ సాగు

జనగామ : జిల్లాలో ఆయిల్‌పామ్ పంట సాగు పెరుగుతోంది. ప్రధాన పంటలుగా వరి, పత్తి, కంది, మొక్కజొన్న సాగవుతున్నాయి. వరి ప్రతి ఏటా రికార్డు స్థాయిలో సాగవుతోంది. అంతే స్థాయిలో ధాన్యం దిగుబడి పెరుగుతోంది. అన్నదాతల ఆదాయం పెంచాలని, దీర్ఘకాలం లాభాలు అందించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రైతులకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు చేసే దిశగా చర్యలు చేపట్టింది. రాయితీలు, మొక్కలు, డ్రిప్ పరికరాలు వంటి అందించి ప్రోత్సహిస్తోంది.

అనువైన నేలలు

జిల్లా వ్యాప్తంగా వరి, పత్తి పంటలకు రైతులు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. వరి సాగు విస్తీర్ణం మరింతగా పెరగడం.. ధాన్యం కొనుగోళ్లలో ఏర్పడుతున్న ఆటుపోట్లతో గట్టెక్కేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తోంది. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు అనువైన నేలలు ఉన్నాయని మూడేళ్ల క్రితమే ప్రభుత్వ సర్వే బృందం పేర్కొంది. ఇందులో భాగంగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో 426 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. 2022-23లో 3,210 ఎకరాలకు పైగా సాగు జరిగింది. ఈ సాగు విస్తీర్ణం మరింత పెంచేందుకు ఉద్యాన-పట్టు పరిశ్రమ, వ్యవసాయ శాఖల అధికారులు, ఉపాధి హామీ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

సాగుకు రాయితీలు..ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోంది. ఒక్కో మొక్క ధర బహిరంగ మార్కెట్‌లో రూ.250 ఉండగా ప్రభుత్వం రూ.20లకే అందిస్తోంది. రైతుకు ఒక్కో ఎకరాకు రూ.27,801 నాలుగు సంవత్సరాలలో అందించనుంది. ఇందులో ఎకరాలో మొక్కలు నాటినందుకు రూ.11,001, మొక్కలు నాటాక అంతర పంటలు, దున్నకాలు, ఎరువులకు ఒక్కో సంవత్సరం రూ.4,200 చొప్పున వరుసగా నాలుగేళ్ల పాటు రాయితీలను అందిస్తోంది. సన్న, చిన్న కారు రైతులకు మొక్కలు నాటేందుకు గుంతలు తీయటం, మొక్కలు నాటడం వంటి పనులు ఉపాధి హామీ పథకం ద్వారా చేయిస్తారు. తోటల్లో అంతర పంటగా పత్తి, మిరప, పప్పు ధాన్యాల సాగు చేసుకోవచ్చు. ఈ విధంగా నాలుగేళ్ల పాటు సాగు చేసుకోవచ్చు. అనంతరం దిగుబడి ఆరంభమవుతుంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి- కేఆర్ లత, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి, జనగామఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించాం. ఆసక్తి కల్గిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లు, పాస్‌ఫొటోలతో ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలి. రైతులకు ముందుగా 90శాతం ప్రభుత్వ రాయితీలతో కూడిన బిందు సేద్య పరికరాలను అందజేస్తున్నాం.

## ప్రధాని మోదీకి 'స్టాండింగ్ ఒవేషన్'.. ప్రత్యేక సన్మానం



దిల్లీ: భాజపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఘన స్వాగతం లభించింది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు నేపథ్యంలో గురువారం ఆయనను ప్రత్యేకంగా సన్మానించారు. సమావేశ మందిరంలోకి మోదీ ప్రవేశిస్తుండగా సభ్యులంతా లేచి నిలబడి కరతాళ ధ్వనుల మధ్య ఆయనకు స్వాగతం పలికారు. పార్టీ సభ్యులంతా మోదీ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ నినాదాలు చేశారు. పార్టీ జాతీయాధ్యక్షుడు జె.పి.నడ్డా ప్రధానిని సత్కరించారు. ఇటీవల వెలువడిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో భాజపా మూడింట్లో గెలిచిన విషయం తెలిసిందే. మరోవైపు తెలంగాణలోనూ ఓట్ల శాతం, సీట్ల సంఖ్యలో పార్టీ పురోగతి సాధించింది. మోదీ నాయకత్వం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో నెలకొంది.

పార్లమెంట్ సమావేశాలు జరిగే సమయంలో తమ లోక్‌సభ, రాజ్యసభలోని పార్టీ సభ్యులతో భాజపా ప్రతివారం భేటీ అవుతుంది. దీంట్లో మోదీ, అమిత్ షా, నడ్డా సహా ఇతర కీలక నేతలు పాల్గొని అజెండా, వ్యూహాలపై సభ్యులకు మార్గనిర్దేశం చేస్తారు.




దిల్లీ: విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి అవసరమైన భూమిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటివరకూ ఇవ్వలేదని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. దక్షిణకోస్తా రైల్వేజోన్‌ను అధికారికంగా ప్రారంభించే ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా? జోనల్‌ప్రధాన కార్యాలయ నిర్మాణం ఎప్పటినుంచి ప్రారంభమైంది? ఎప్పటికి పూర్తవుతుంది? నిర్మాణం పూర్తిచేయడానికి ఎన్నిరోజులు పొడిగించారు? ఇప్పటివరకు ఎన్ని నిధులు కేటాయించారు? ఎంత ఉపయోగించారు? అని లోక్‌సభలో తెదేపా ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. "దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారైంది. రూ.106.89 కోట్ల అంచనా వ్యయంతో జోనల్ ప్రధాన కార్యాలయ నిర్మాణ పనులను మంజూరు చేశాం. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇందుకోసం రూ.10 కోట్లు కేటాయించాం. భూసర్వే, జోన్ ప్రధాన కార్యాలయ సముదాయం, రెసిడెన్షియల్‌కాలనీ, ఇతర నిర్మాణాలకు అవసరమైన లే అవుట్ ప్లాన్ తయారీ బాధ్యతలను తూర్పుకోస్తా రైల్వేజోన్‌కు అప్పగించాం. ముడసర్లోవలోని 52.2 ఎకరాల భూమిలో ఈ జోన్ ప్రధాన కార్యాలయం నిర్మించాలని డీపీఆర్‌లో ప్రతిపాదించాం. బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టం (బీఆర్‌టీఎస్)కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైల్వే భూమి తీసుకున్నందున దానికి బదులుగా ముడసర్లోవలో 52.2 ఎకరాల భూమిని గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైల్వేకు అప్పగించాల్సి ఉంది. ఇందుకు అనువైన భూమిని ప్రభుత్వం ఇంకా గుర్తించి, రైల్వేశాఖకు అప్పగించాల్సి ఉంది" అని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. విశాఖపట్నం జంక్షన్–గోపాలపట్నం మధ్య 15.31 కిలోమీటర్ల మేర రూ.159.47 కోట్లతో 3, 4 లైన్ల నిర్మాణం కోసం 2023 ఏప్రిల్‌లో అనుమతులు మంజూరుచేసినట్లు రైల్వే మంత్రి వెల్లడించారు.

## ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం ఒక సిగ్గుమాలిన చర్య: చంద్రబాబు



బర్తిపూడి: బాపట్ల జిల్లాలోని బర్తిపూడిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. అర్ధరాత్రి వేళ విగ్రహం తల పగులగొట్టి పరారయ్యారు. ఈ ఘటనను తెలుగుదేశం అధినేత చంద్రబాబు , పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఖండించారు. అర్ధరాత్రి వెళ్లి ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం ఒక సిగ్గుమాలిన చర్య అని చంద్రబాబు మండిపడ్డారు. మహనీయుల పట్ల అగౌరవంగా వ్యవహరించడం వైకాపా అహంకారానికి నిదర్శనమన్నారు.

బాధ్యులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటమి భయంతో వైకాపా ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని లోకేశ్ ఆరోపించారు. తెలుగు ప్రజల గుండెల్లో కొలువైన ఎన్టీఆర్ స్థానాన్ని వైకాపా.. ఆయన విగ్రహాల కూల్చివేతతో చెరిపేయలేదని స్పష్టం చేశారు. 3 నెలల్లో కూల్చిన వారితోనే ఎన్టీఆర్ విగ్రహం కూల్చిన చోటే మళ్లీ పెట్టిస్తామని అన్నారు. జై తెలుగుదేశం.. జోహార్ ఎన్టీఆర్.. అంటూ లోకేష్ నినదించారు. వాళ్లు ధ్వంసం చేసింది విగ్రహాన్ని కాదు తెలుగు ప్రజల ఆత్మ గౌరవ ప్రతీకను అని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మండిపడ్డారు.

## ఈ రెండు జిల్లాల్లో వైఎస్ జగన్ పర్యటన..నేడే : చురుగ్గా ఏర్పాట్లు



అమరావతి : మిఛౌంగ్ తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో అతి భారీ వర్షాలు కురిశాయి. పెద్ద ఎత్తున పంట నీటి పాలయింది. పంట నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పంట నష్టం వివరాలు నమోదు చేస్తోంది. దీనికి సంబంధించిన అంచనాలు రూపొందించి, రైతులకు పంటల భీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ప్రయోజనాలు కల్పించాలని నిర్ణయించింది. ఈ తుఫాన్ బాపట్ల వద్ద తీరాన్ని దాటిన విషయం తెలిసిందే. దీని ఫలితంగా– నెల్లూరు, తిరుపతి, ప్రకాశం, చిత్తూరు, అన్నమయ్య రాయచోటి, బాపట్ల.. జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిశాయి. అనేక లోతట్టు ప్రాంతాలను ముంచెత్తాయి. ఆయా జిల్లాల్లోని చెరువులు పొంగిపొర్లాయి. తీరప్రాంతవాసులను ప్రభుత్వం సురక్షిత ప్రదేశాలకు తరలించింది. ప్రాణనష్టం జరగకుండా నివారించగలిగింది. ఎనిమిది జిల్లాల్లో 320 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసింది ప్రభుత్వం. 20,572 మందిని తరలించింది. వారందరికీ భోజనం, మంచి నీటి సౌకర్యం కల్పించింది. నిత్యావసర సరుకులను సైతం పంపిణీ చేసింది. బాధిత కుటుంబాలు మళ్లీ తమ ఇళ్లకు వెళ్లే ముందు ఆర్థిక సాయంగా రూ.1000 నుంచి రూ.2500 అందించింది.

కాగా– వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటించనున్నారు. బాపట్ల, తిరుపతి జిల్లాల్లో గురువారం ఆయన పర్యటన షెడ్యూల్ అయింది. బాపట్లతో పాటు తిరుపతి జిల్లాలోని గూడూరుకు వెళ్లనున్నారు. తుఫాన్ మిగిల్చిన నష్టాన్ని స్వయంగా పరిశీలించనున్నారు. బాపట్ల, గూడూరు నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలను జగన్ సందర్శిస్తారు. పంట నష్టంపై అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. పంట నష్టంపై వారిని అడిగి తెలుసుకుంటారు. వరద బాధితులు, రైతులకు అప్పటికప్పుడే అధికారులకు అవసరమైన ఆదేశాలను జారీ చేస్తారు. తొలుత ఏరియల్ సర్వే నిర్వహిస్తారు. అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. ఈ పర్యటనలో వైఎస్ జగన్ వెంట.. వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్, వైద్య– ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఉంటారు. తిరుపతి, బాపట్ల జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు జగన్ పర్యటనలో పాల్గొనే అవకాశం ఉంది.

## అధికారమదంతో విగ్రహాలు పగులగొట్టగలరేమో కానీ..



అమరావతి: బాపట్ల మండలం భర్తీపుడిలో వైసీపీ అల్లరి మూకలు ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. ఎన్టీఆర్ విగ్రహ ధ్వంసాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వాళ్ళు ధ్వంసం చేసింది విగ్రహాన్ని కాదని తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీకను అని అన్నారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్టీఆర్‌ను అడుగడుగునా అవమానిస్తున్నారని మండిపడ్డారు. హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరు తొలగించారని, విగ్రహాలపై దాడులు చేస్తున్నారని అన్నారు. అధికారమదంతో పేర్లు మార్చగలరు, విగ్రహాలు పగులగొట్టగలరేమో కానీ ప్రజల గుండెల్లో నుంచి ఎన్టీఆర్‌ను తొలగించలేరని స్పష్టం చేశారు. అధికారమదంతో అన్నగారి విగ్రహాలు పగులగొడుతున్న వారి ఒళ్లు పగలకొట్టడం ఖాయమని హెచ్చరించారు. దుండగులపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు.

## బాపట్లలో ఎన్టీఆర్ విగ్రహం కూల్చివేతపై లోకేష్ రియాక్షన్



అమరావతి: బాపట్ల మండలం భర్తీపూడిలో ఎన్టీఆర్ విగ్రహం కూల్చివేతపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఓటమి భయంతో వైసీపీ ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. తెలుగు ప్రజల గుండెల్లో కొలువైన ఎన్టీఆర్ స్థానాన్ని ఆయన విగ్రహాల కూల్చివేతతో వైసీపీ చెరిపేయలేదన్నారు. 3 నెలల్లో కూల్చిన వారితోనే ఎన్టీఆర్ విగ్రహం కూల్చిన చోటే మళ్లీ పెట్టిస్తామన్నారు. జై తెలుగుదేశం.. జోహార్ ఎన్టీఆర్ అని లోకేష్ అన్నారు.




## సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డి ప్రజలకు సుపరిపాలన అందించాలని చంద్రబాబు ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి గురువారం నాడు ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే.


## తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలుకు చర్యలు : మంత్రి కారుమూరి నాగేశ్వరరావు





విజయవాడ: రైతులను అన్ని విధాల ఆదుకుంటామని, తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకున్నట్లు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సబ్సిడీపై మినుము విత్తనాలు అందిస్తున్నట్లు చెప్పారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకుంటామని, అధైర్య పడవద్దని రా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు రైతులకు భరోసా నిచ్చారు. మంత్రి కారుమూరి పామర్రు, గుడూరు, బందరు, పెదన, బంటుమిల్లి మండలాల్లో పర్యటించి దెబ్బతిన్న వరి పొలాలు, ధాన్యం రాశులు పరిశీలించి రైతులతో మాట్లాడి పంట నష్టం గురించి, రైతుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. తొలిత మంత్రి పైడిముక్కల మండలం గోపవానిపాలెం, పామర్రు మండలం కొండిపర్రు రైతులను, అనంతరం గూడూరు మండలం తరకటూరు రైతులను, బందరు మండలం సుల్తానగరం, అరిసెపల్లి రైతులను బంటుమిల్లి మండలం ఆర్తమూరు, బాసిన పాడు రైతులను మంత్రి కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆరబెట్టిన ధాన్యం రాశులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మిచోంగ్ తుఫాన్ అకాల వర్షాలకు పంట దెబ్బతిన్న రైతాంగానికి అండగా ఉంటామన్నారు. ఎన్యుమరేషన్ బృందాలు ప్రతి గ్రామంలో పర్యటించి పంట నష్టం వివరాలు నమోదు చేసుకుని, అంచనాలు రూపొందించి, రైతులకు పంటల భీమా, ఇన్పుట్ సబ్సిడీ ప్రయోజనాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు ఆన్ లైన్లో 1.37 లక్షల మెట్రిక్ టన్నులు, ఆఫ్ లైన్ లో 1.10 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, ఇప్పటివరకు రైతులకు రు.1070 కోట్ల రూపాయలు చెల్లింపులు చేసినట్లు తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు వేగంగా చెల్లింపులు చేస్తామని, రెండు, మూడు రోజులకోసారి రైతులకు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటామని, రవాణా, హమాలీ చార్జీలు సత్వరమే చెల్లించుటకు చర్యలు తీసుకుంటామన్నారు. కౌలుదారి రైతులు సొసైటీల ద్వారా ధాన్యం విక్రయించాలని మంత్రి సూచించారు. అట్టి వారికి సొసైటీల ద్వారా చెల్లింపులు చేయడం జరుగుతుందన్నారు. అక్కడక్కడ మినుము పంట కూడా నీట మునిగి దెబ్బతిన్నదనీ ఆదుకోవాలని రైతులు మంత్రిని కోరగా, సబ్సిడీపై మినుము విత్తనాలు మళ్లీ రైతులకు అందించుటకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పర్యటనలో తరకటూరు వద్ద గూడూరు ఎంపీపీ సంఘ మధుసూదన్ రావు, జడ్పిటిసి వేముల సురేష్ రంగబాబు మంత్రిని కలిసి రైతుల సమస్యలు వివరించారు. ఉయ్యూరు ఆర్డిఓ, జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఇంచార్జ్ రాజు, డీఎస్ఓ పార్వతి, ఆయా మండలాల తాసిల్దార్లు రెవెన్యూ సిబ్బంది మంత్రి వెంట ఉన్నారు.

## రైతు సమాఖ్య పిటేషన్లకు విచారణ అర్హత ఉంది: హైకోర్టు




అమరావతి: రాజధాని రైతులకు కౌలు చెల్లించాలని రైతు పరిరక్షణ సమితి, రైతు సమాఖ్య తరపున వేసిన పిటేషన్లకు విచారణ అర్హత ఉందని గురువారం హైకోర్టు తీర్పు వెలువరించింది. ఈ పిటీషన్‌లకు విచారణ అర్హత లేదని ప్రభుత్వ న్యాయవాదుల అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వ వాదనలపై రైతుల తరపు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధర్ రావు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇరు వర్గాల వాదనలు విన్న అనంతరం ఈ మేరకు న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. రైతులకు కౌలు చెల్లించాలని వేసిన పిటీషన్‌లకు విచారణ అర్హత ఉందని స్పష్టం చేసింది. రెండు సంఘాల్లోని రైతులందరూ కోర్టు ఫీజ్ చెల్లించాలని ఆదేశించింది. 10 రోజుల్లో కోర్టు ఫీజ్ చెల్లించిన తరువాత విచారణ చేస్తామని హైకోర్టు చెప్పింది.

# రెడ్ డ్రెస్ తో అందం మరింత పెరిగిందే!

మెగా హీరో వరుణ్ తేజ్ తో 'కంచె' సినిమాలో నటించడం ద్వారా సౌత్ ఆడియన్స్ కి ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలుగా మారిన ప్రగ్యా జైస్వాల్ ఆ సినిమా తో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రగ్యా కంచె తో వచ్చిన ఇమేజ్ ని ఉపయోగించుకొని వరుస సినిమాలు చేస్తుందని అంతా అనుకున్నారు. కానీ అలా జరగలేదు. కంచె తర్వాత ప్రగ్యా జైస్వాల్ కి ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాలేదు. దాంతో వచ్చిన ఆఫర్లను సద్వినియోగం



చేసుకునేందుకు కమిట్ అయింది. అయితే అందులో కొన్ని సినిమాలు నిరాశ పర్చిన కొన్ని సినిమాలు ఆమె ఇమేజ్ నే దెబ్బ తీశాయి.

దాంతో ఆఫర్ల కోసం ప్రగ్యా జైస్వాల్ వెతుక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. సినిమాల పరంగా ఆఫర్ల కోసం వెతుక్కోవాల్సిన వచ్చినా కూడా సోషల్ మీడియాలో మాత్రం తన గురించి అంతా వెతికే మాదిరిగా ఈమె ఫోటోలు షేర్ చేస్తుంది. తాజాగా మరోసారి రెడ్ డ్రెస్ లో చాలా అందంగా కనిపిస్తూ ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్నా కూడా ప్రగ్యా కి ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదు అనేది కొందరి మాట. ప్రగ్యా అందం కేవలం సోషల్ మీడియాకే పరిమితం అవ్వాలా అన్నట్లుగా కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ మధ్య అఖండ సినిమాలో కనిపించిన కూడా ఆ సినిమా తో ప్రగ్యా కి పెద్దగా బెనిఫిట్ జరగలేదు. దాంతో ప్రగ్యా ఆఫర్ల కోసం అన్వేషణ సాగిస్తూనే ఉంది.

## ప్రాఫిట్ వచ్చేలా మాస్ హీరో రీమేక్ ప్లాన్

మాస్ మహారాజ్ రవితేజ ప్రస్తుతం ఈగల్ సినిమా విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతికి విడుదల కాబోతోంది. ఇక ఈ సినిమా పూర్తయిన వెంటనే రవితేజ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో మరొక సినిమాను మొదలు పెట్టాలని అనుకున్నాడు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్లో ఆ ప్రాజెక్టు మొదలుపెట్టడానికి అంతా సిద్ధం చేసుకున్నారు. కానీ చివరికి బడ్జెట్ విషయంలో కొన్ని కారణాల వలన సినిమాను ఆపేయాల్సి వచ్చింది. 120 కోట్ల వరకు బడ్జెట్ అవుతూ ఉండడంతో రిస్క్ అని నిర్మాతలు ఆ ప్రాజెక్టు నుంచి హోల్డ్ లో పెట్టారు. దీంతో రవితేజ ఆ ప్రాజెక్టు నుంచి తప్పుకొని పీపుల్స్ వీడియో ఫ్యాక్టరీలో కొత్త ప్రాజెక్టు చేయడానికి



వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. దర్శకుడిగా హరీష్ శంకర్ ఫిక్స్ అయ్యాడు. మొదట వీరు ఒక కొత్త తరహా కథ చేయాలని అనుకున్నారు. కానీ మళ్ళీ వెనక్కి తగ్గి రీమేక్ చేయాలి అని డిసైడ్ అయ్యారు. అయితే ముందుగా బడ్జెట్ ప్రణాళిక సిద్ధం చేసుకున్న తర్వాతనే రీమేక్ ప్లాన్ చేయాలని డిసైడ్ అయినట్లుగా తెలుస్తోంది. నిర్మాతకు టేబుల్ ప్రాఫిట్ వచ్చే విధంగా డైరెక్టర్ హీరో పారితోషకాలు సినిమా బడ్జెట్ అంతా కూడా ముందుగానే ఫిక్స్ చేసుకున్నారు. డైరెక్టర్ హీరో పారితోషకం 40 కోట్లు కాగా బడ్జెట్ మరొక 40 కోట్లుగా ఫిక్స్ చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఇక సినిమాను వీలైనంత తొందరగా పూర్తి చేసి విడుదల చేయాలని అనుకుంటూ ఉన్నారు. హిందీలో అజయ్ దేవగన్ నటించిన రెయిడ్ సినిమాకు ఇది రీమేక్ అని తెలుస్తోంది. తెలుగు ప్రేక్షకులకు అభిరుచికి తగ్గట్టుగా స్క్రిప్టును దర్శకుడు సరికొత్తగా మారుస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఉత్తరప్రదేశ్లో ఒక షెడ్యూల్ కూడా ప్లాన్ చేశారు. రవితేజ ఏమాత్రం సమయం వృధా చేయకుండా మూడు నెలలోనే సినిమాను ఫినిష్ చేయాలని అనుకుంటున్నాడు. అలాగే దిల్ రాజు ప్రొడక్షన్లో కూడా ఒక సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. రాజా ది గ్రేట్ లాంటి మంచి సక్సెస్ ఇచ్చిన అనిల్ రావిపూడి తో ఆ ప్రాజెక్టు ఉండబోతోంది. అలాగే రవితేజ మరో రెండు ప్రాజెక్టులను కూడా త్వరలో ఒకే చేసే పనిలో ఉన్నాడు.




# వార్ 2 లో పఠాన్- టైగర్ చేరతారా?



యశ్ రాజ్ ఫిలింస్ లో భారీ స్పై యూనివర్స్ చిత్రాలు ఇటీవల ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. టైగర్ ఫ్రాంఛైజీతో పాటు, అటు వార్ ఫ్రాంఛైజీలో పలు చిత్రాలు సంచలన విజయాలు సాధించాయి. పఠాన్ తో కింగ్ ఖాన్ షారూక్ కూడా ఈ తరహా ఫ్రాంఛైజీ రేస్ లో చేరడంతో ఉత్కంఠ మొదలైంది. ఇంతలోనే వార్ 2లో జూ.ఎన్టీఆర్ ప్రవేశించడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మొదటి సారి యష్ రాజ్ ఫిలింస్ లోని భారీ చిత్రంలో టాలీవుడ్ హీరో నటిస్తుండడం ఉత్కంఠ రేపుతోంది. హృతిక్ తో వార్ చిత్రంలో టైగర్ ష్రాఫ్ నటించాడు. కానీ ఈసారి యంగ్ టైగర్ ఎన్టీఆర్ కి అలాంటి ఒక అవకాశం దక్కింది. తారక్ ఈ చిత్రంలో విలన్ పాత్రలో నటించనున్నాడు. దీంతో వార్ 2 పై ఇటు సౌత్ లోను బజ్ పెరిగింది. అయితే వార్ 2లో పఠాన్- టైగర్ 3 తరహాలో ప్రత్యేక అతిథి పాత్ర ఏదైనా ఉంటుందా? అన్న చర్చా సాగుతోంది. పఠాన్ లో సల్మాన్ అతిథి పాత్ర బ్లాక్ బస్టర్ అయింది. కానీ టైగర్ 3లో షారూఖ్ అతిథి పాత్ర ఏమంత కలిసి రాలేదన్న చర్చా సాగుతోంది. ఓవరాల్ గా టైగర్ 3 బాక్సాఫీస్ వద్ద ఫెయిలైంది. దీంతో ఇప్పుడు యష్ రాజ్ ఫిలింస్ తదుపరి చిత్రాలపై చాలా ఎక్కువగా దృష్టి సారించింది. ముఖ్యంగా వార్ 2లో అతిథి పాత్రలేవీ ఉండవని తాజాగా తెలిపారు. ప్రధాన పాత్రధారులైన ఎన్టీఆర్, హృతిక్ పైనే ఆడియెన్ దృష్టి ఉండాలని యష్ రాజ్ బ్యానర్ భావిస్తోందట. దీంతో వార్ 2లో అతిథి పాత్రలేవీ ఉండవని కూడా తెలుస్తోంది. టైగర్ 3- పఠాన్ వంటి స్పై యూనివర్స్ చిత్రాలు అతిథి పాత్రలతో ఆశ్చర్యపరిచాయి. దీంతో ఎన్టీఆర్, హృతిక్‌ల వార్ 2కి కూడా ఇలాగే అతిథి జాయిన్ అవుతాడా? అన్న చర్చా సాగుతోంది. కానీ టైగర్ 3 వైఫల్యం ఈ ఆలోచనలకు చెక్ పెట్టింది. వార్ 2లో ఇప్పటికే ఇద్దరు పాన్ ఇండియా స్టార్స్ నటిస్తున్నారు కాబట్టి, అతిథి పాత్రలతో ప్రేక్షకుల దృష్టిని మళ్లించకూడదని నిర్మాత ఆదిత్య చోప్రా .. దర్శకుడు అయాన్ ముఖర్జీ ఒక నిర్ణయానికి వచ్చారని తెలిసింది. నిజానికి టైగర్ 3 నెగెటివ్ రిజల్ట్ ఊహించని షాకిచ్చింది. టైగర్ 3కి వచ్చిన అతితక్కువ స్పందన మేకర్స్‌ని ఆలోచించుకునేలా చేసింది. టైగర్ 3 ఆశించిన స్థాయిలో క్రేజ్ పొందకపోవడంతో మేకర్స్ తమ పూర్తి దృష్టిని వార్ 2 పై పెట్టారు. జనవరి 2025లో ఈ సినిమా విడుదలవుతుంది. అంటే ఇంకో ఏడాది పాటు ఈ సినిమా కోసం వేచి చూడాలి. ఈలోగా ఇతర ప్రాజెక్టులపైనా యష్ రాజ్ బ్యానర్ దృష్టి పెడుతుంది. అత్యంత భారీ బడ్జెట్ తో రూపొందాల్సిన టైగర్ వర్సెస్ పఠాన్ కూడా ప్రస్తుతానికి నిలిచిపోయిందని ప్రచారం సాగుతోంది. సూపర్ స్టార్లు సల్మాన్ ఖాన్ .. షారుక్ ఖాన్‌లతో పూర్తి నిడివి గల గూఢచారి డ్రామాను అసాధారణమైన కథతో చేయాలి. దానికి తగ్గట్టు భారీ బడ్జెట్లను వెచ్చించాలి. కాబట్టి యష్ రాజ్ ఫిలింస్ సంస్థ చాలా యోచిస్తోందని సమాచారం.

# అమ్మ డ్రెస్‌లో మెరిసిన ఖుషి.. మొదటి సినిమా సెంటిమెంట్







బాలీవుడ్ తో పాటు సౌత్ లో కూడా స్టార్ ఇమేజ్ ను సొంతం చేసుకున్న దివంగత నటి అతిలోక సుందరి శ్రీదేవి పెద్ద కూతురు జాన్వీ కపూర్ ఇప్పటికే హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి వరుస సినిమాలతో దూసుకు పోతున్న విషయం తెల్సిందే. తాజాగా శ్రీదేవి రెండో కూతురు ఖుషి కపూర్ కూడా హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అయింది. ఖుషి కపూర్ ఎంట్రీ గురించి చాలా కాలంగా చర్చలు జరుగుతున్నాయి. సినిమాల్లో నటించకుండానే సోషల్ మీడియా ద్వారా పాపులారిటీని సొంతం చేసుకున్న ఖుషీ కపూర్ ఇప్పుడు జోయా అక్తర్ దర్శకత్వంలో రూపొందిన ఆర్చీస్ సినిమాతో తెరంగేట్రం కు రెడీ అయింది. తాజాగా ఆర్చీస్ సినిమా ప్రీమియర్ షో ఏర్పాటు చేయడం జరిగింది. ప్రీమియర్ షో లో ఖుషి కపూర్ అరుదైన డ్రెస్ లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ డ్రెస్ తన తల్లి శ్రీదేవి దాదాపు పదేళ్ల క్రితం ధరించిన ఐకానిక్ గౌను అవ్వడంతో ఖుషి కార్యక్రమంలో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది అనడంలో సందేహం లేదు. తన మొదటి సినిమా ప్రీమియర్ కి తల్లి గౌన్ ను ధరించడం సెంటిమెంట్ గా ఖుషి కపూర్ భావించినట్లుగా తెలుస్తోంది. తన తల్లి ఈ సమయంలో లేకున్నా కూడా ఆమె ఆశీస్సులు ఎప్పుడూ కూడా ఉంటాయని ఖుషి మరియు జాన్వీ కపూర్ లు సన్నిహితుల వద్ద మాట్లాడినట్లుగా తెలుస్తోంది. ఆర్చీస్ సినిమాలో ఖుషి కపూర్ తో పాటు సుహానా ఖాన్, వేదాంగ్ రైనా, అగస్త్య, మిహిర్ అహుజా, యువరాజ్ మెండా లు కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ సినిమాలో పలువురు స్టార్ కిడ్స్ ఉండటంతో అందరి దృష్టిని ఈ సినిమా ఆకర్షిస్తోంది.

# ఎల్లో ఎల్లో బ్యూటీ ఫెల్లో

ఎప్పుడో రెండు దశాబ్దాల క్రితం ఇండస్ట్రీలో అడుగు పెట్టిన శ్రియ శ్రియా సరన్ ఇంకా కూడా తన అందంతో, అభినయంతో ప్రేక్షకులను మెప్పిస్తూ ఉంది. ఒక వైపు పెళ్లి, పిల్లలతో సంసార జీవితాన్ని చాలా ఆనందంగా సాగిస్తున్న శ్రియ సరన్ మరో వైపు తన అభిమానులను నెటిజన్స్ ను, తన ఫాలోవర్స్ ని ఎంటర్ టైన్ చేసేందుకు అందమైన ఫోటోలను షేర్ చేస్తోంది. ఇప్పటికీ తెలుగు, హిందీ భాషలతో పాటు ఇతర భాషల సినిమాల్లో కూడా నటిస్తూ బిజీగా ఉంది. ఒకప్పటి మాదిరిగా స్టార్ హీరోలకు జోడీగా నటించే ఛాన్స్ దక్కకున్నా కూడా శ్రియ అందంకు తగ్గట్లుగా మంచి పాత్రలు



మరియు మంచి సినిమాలు వస్తూనే ఉన్నాయి. అందకు కారణం సోషల్ మీడియాలో శ్రియ షేర్ చేసే ఫోటోలు అనడంలో సందేహం లేదు. తాజాగా మరోసారి శ్రియ తన అందంతో ఫ్యాన్స్ ను ఎంటర్ టైన్ చేసింది. ఎల్లో డ్రెస్ లో క్లీ వేజ్ షో చేస్తూ క్లోజప్ లో మరింత అందంగా శ్రియ కనిపిస్తోంది అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. మరో పదేళ్ల పాటు శ్రియ కి హీరోల పక్కన హీరోయిన్ గా నటించే అవకాశాలు రావాలని ఈ ఫోటోలు చూస్తే అనిపిస్తుందని ఫ్యాన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లో ఎల్లో డర్టీ ఫెల్లో అని కాకుండా శ్రియ సరన్ ను ఇలా ఎల్లో డ్రెస్ లో చూస్తూ ఉంటే ఎల్లో ఎల్లో బ్యూటీ ఫెల్లో అనాలి అనిపిస్తోందని కూడా కొందరు ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి శ్రియ వయసు పెరుగుతున్నా కూడా మరింత అందంగా కనిపిస్తుందని ఈ ఫోటోలు మళ్లీ నిరూపించాయి.

## యానిమల్ 'జోయా' గురించి చర్చోపచర్చలు

రణబీర్ కపూర్ హీరో గా రష్మిక మందన్న హీరోయిన్ గా నటించిన యానిమల్ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ స్పందన వచ్చింది. సినిమాలోని పాత్రలను దర్శకుడు సందీప్ వంగ చూపించిన తీరుకు విమర్శకులు సైతం ప్రశంసలు కురిపిస్తున్నారు. యానిమల్ సినిమాలో జోయా పాత్రలో కనిపించిన నటి గురించి ప్రస్తుతం ఆసక్తికర చర్చ జరుగుతోంది. హిందీ నటి త్రిప్తి దిమ్రీ ఆ పాత్రలో నటించి బాలీవుడ్ తో పాటు టాలీవుడ్ ప్రేక్షకులను కూడా మెప్పించింది. ప్రస్తుతం ఆమె గురించి సోషల్ మీడియాలో చర్చోప చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే రవితేజ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమా కోసం ఆమెను సంప్రదించారు, ఆమె ఓకే చెప్పిందనే వార్తలు జోరుగా వస్తున్నాయి.



కానీ ఇప్పటి వరకు అలాంటి చర్చలు జరగలేదని యూనిట్ సభ్యుల నుంచి క్లారిటీ వచ్చింది. ఇక ఆమె సినిమాల గురించి కూడా అప్పుడే చర్చలు మొదలయ్యాయి. నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతున్న క్వాలా తో ప్రేక్షకులకు పరిచయం అయ్యి జోయా పాత్ర ద్వారా మరింత పాపులారిటీని సొంతం చేసుకుంది. ప్రస్తుతం హిందీలో పలు సినిమాల్లో నటిస్తున్న ఈ అమ్మడు సౌత్ లో మాత్రం ఇంకా ఏ సినిమాకు కమిట్ అవ్వలేదు. చిన్నా చితక పాత్రల్లో, గెస్ట్ రోల్స్, ఐటం సాంగ్స్ లో నటించేందుకు సిద్ధంగా లేనంటూ త్రిప్తి చెప్పుకొచ్చింది. సౌత్ లో నటించేందుకు అభ్యంతరం లేదు. కానీ స్టార్ హీరోల సినిమాల్లో మాత్రమే నటిస్తానంటూ చెప్పుకొచ్చింది. ఈమె ప్రతిభకి కాస్త వెయిట్ చేస్తే తప్పకుండా సౌత్ లో స్టార్స్ నుంచి పిలుపు వచ్చే అవకాశాలు లేకపోలేదని ఇండస్ట్రీ వర్గాల వారు అంటున్నారు.




# ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం..

హైదరాబాద్: తెలంగాణ రెండో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రేవంత్‌తో గవర్నర్ తమిళిసై ప్రమాణం చేయించారు. అనంతరం పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి గుడికి కుటుంబ సమేతంగా వెళ్లిన రేవంత్ రెడ్డి.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం ఎల్బీ స్టేడియానికి చేరుకున్నారు. మార్గమధ్యలో గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు.

**రేవంత్‌రెడ్డి కుటుంబ వివరాలు..**

తల్లిదండ్రులు: ఎనుముల నరసింహారెడ్డి, రామచంద్రమ్మ

పుట్టిన తేదీ: నవంబరు 08, 1969

విద్యార్హతలు: డిగ్రీ (ఏవీ కళాశాల, హైదరాబాద్)

భార్య: గీత కుమార్తె: నైమిషా రెడ్డి

నివాసం: జూబ్లీహిల్స్

**రాజకీయ నేపథ్యం.. పదవులు**

2006: స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి మిడ్జిల్ (ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా) జడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నిక

2007-2009: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ (ఆంధ్రప్రదేశ్ శాసన మండలి)

2009-2014: ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ శాసనసభ (కొడంగల్ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసి నెగ్గారు)

2014: మరోసారి ఎమ్మెల్యేగా ఎన్నిక (కొడంగల్ నుంచే తెదేపా అభ్యర్థిగా గెలుపు)

2014-2017: తెదేపా శాసనసభా పక్షనేత (తెలంగాణ శాసనసభ)

2017 అక్టోబరు: కాంగ్రెస్ పార్టీలో చేరిక

2018: శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా కొడంగల్ నుంచి పోటీ చేసి ఓటమి

2018: పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియామకం

2019 మే: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా(కాంగ్రెస్) గెలుపు

2021 జూన్ 26: పీసీసీ అధ్యక్షుడిగా నియామకం




# ఈ కీలక శాఖలకు మంత్రులెవరు? ఎప్పుడు కేటాయిస్తారు?

హైదరాబాద్: తెలంగాణలో రేవంత్‌రెడ్డి సర్కార్ కొలువుదీరింది. ఆయనతో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అలాగే వారికి శాఖలు కూడా కేటాయించారు. మొత్తం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సహా 18 మందికి అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం సీఎంతో సహా 12 మందే ఆసీనులయ్యారు. రేవంత్ కేబినెట్‌లో ఇంకా ఆరుగురికి ఛాన్సుంది. అలాగే కీలక మైన శాఖలను ప్రస్తుతం రేవంత్‌రెడ్డి తన దగ్గరే ఉంచుకున్నారు. తెలంగాణలో ఐటీ శాఖకు చాలా ప్రాధాన్యత ఉంది. తెలంగాణకు ఐటీ శాఖే దిక్సూచి లాంటింది. అలాంటి పోస్టును ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి తన దగ్గరే ఉంచుకున్నారు. రెండో విడత కేబినెట్ విస్తరణలో ఆ కీలక పోస్టును మరొకరికి కేటాయిస్తారా? లేదంటే ఆయన దగ్గరే ఉంచుకుంటారో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారిపోయింది.

బీఆర్ఎస్ ప్రభుత్వం కూలిపోయిన తర్వాత ప్రధానంగా ఐటీ శాఖపైనే సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరిగింది. హైదరాబాద్‌కు ఐటీ పరిశ్రమలు రావడానికి కేటీఆర్ కారణమంటూ పలువురు నెటిజన్లు ట్వీట్లు చేశారు. అలాంటి శాఖను కేటీఆర్ తర్వాత కాంగ్రెస్‌లో ఎవరు ముందుకు తీసుకెళ్తారని ప్రశ్నలు తలెత్తాయి. శ్రీధర్‌బాబుకు ఐటీ శాఖ అప్పగిస్తారని అనుకున్నారు.. కానీ ఆయనకు ఆర్థిక శాఖను అప్పగిస్తూ రేవంత్ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం సీఎం దగ్గరే ఐటీ, విద్యాశాఖ, విద్యుత్, పంచాయతీ రాజ్, రవాణా, కార్మిక, వ్యవసాయ, దేవాదాయ, సినిమాటోగ్రఫీ శాఖలు ఉన్నాయి. మరీ ఈ శాఖలను ఎవరికి కేటాయిస్తారో మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



# సీతక్క ప్రమాణం: దద్దరిల్లిన ఎల్బీస్టేడియం..

## సీతక్కకు, కొండా సురేఖకు సోనియాగాంధీ ఆలింగనం!!

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నేడు కొలువుదీరింది. తెలంగాణ సీఎం గా రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేయడంతో పాటు, డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క తో పాటు మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. గిరిజన బిడ్డగా నక్సలైట్ నుండి మంత్రిగా ఎదిగిన ధనసరి అనసూయ అలియాస్ సీతక్క ప్రమాణస్వీకారం అందరికీ ఆసక్తిని కలిగించింది. ప్రమాణస్వీకారానికి సీతక్కని పిలిచిన వెంటనే ఆమె వేదికపైకి చేరుకోగానే అభిమానులు కేరింతలతో హోరెత్తారు. ఎల్బీ స్టేడియం ప్రాంగణమంతా మోత మోగిపోయింది. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు తన అభిమానులకు అభివాదం చేసిన సీతక్క మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.

ముఖ్యమంత్రి సహా మంత్రులంతా దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను అని చెబితే సీతక్క మాత్రం దైవ సాక్షికి బదులుగా పవిత్ర హృదయంతో అని ప్రమాణం చేశారు. తెలుగులోనే ప్రమాణ స్వీకారం చేసిన సీతక్క శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని,భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని, తెలంగాణా రాష్ట్ర మంత్రిగా, నా కర్తవ్యాన్ని శ్రద్ధతో, అంతఃకరణ చిత్త శుద్ధితో నిర్వహిస్తానని, భయం గానీ, పక్షపాతం కానీ, రాగద్వేషాలు కానీ లేకుండా రాజ్యాంగాన్ని, శాసనాలను అనుసరించి ప్రజలందరికీ న్యాయం చేకూరుస్తానని పవిత్ర హృదయంతో ప్రమాణం చేస్తున్నాను" అంటూ ప్రమాణం చేశారు.

# ప్రజా దర్బార్‌తో ప్రజలకు దగ్గరవుతాం



హైదరాబాద్: ప్రజా దర్బార్‌తో ప్రజలకు దగ్గరవుతామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఏబీఎన్‌తో మంత్రి మాట్లాడారు. "మా నిర్ణయాలు చూసి కేసీఆర్‌కు దిమ్మ తిరుగుద్ది. రాష్ట్రంలో నియంత పాలనను అంతమొందించాం. ప్రజా పాలన మొదలు కాబోతోంది. పాలనను గాడిన పెడతాం. ప్రజలు సమస్య చెప్పుకోవడానికి మొన్నటి వరకు అవకాశమే లేదు. ప్రజలందరూ ఎప్పుడైనా ప్రగతి భవన్‌కు రావచ్చు. కేసీఆర్ అహంకారం పూర్తిగా దించేస్తాం. చేసిన పొరపాట్లకు కేసీఆర్ పశ్చాత్తాపం చెందాలి." అని సూచించారు.




హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా డిసెంబరు 9 నుంచి రెండు గ్యారంటీలను అమలు చేయాలని నిర్ణయించినట్టు రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ తొలి భేటీ ముగిసిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సాయాన్ని రూ. 10లక్షల వరకు పెంపు హామీలను సోనియా పుట్టిన రోజు సందర్భంగా అమల్లోకి తీసుకొస్తామని వెల్లడించారు. ఈ రెండు గ్యారంటీలపై ఆయా శాఖల అధికారులతో శుక్రవారం సీఎం చర్చిస్తారని వెల్లడించారు. "2014 నుంచి 2023 డిసెంబరు 7 వరకు ఏ శాఖలో ఎన్ని నిధులు ఖర్చు పెట్టారు.. దేనికి ఖర్చు చేశారు. వాటి ప్రయోజనాలు ప్రజలకు ఎంత వరకు చేరవయ్యాయనేదానిపై శ్వేతపత్రం విడుదల చేయాలని భావిస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తెలంగాణ ప్రజలకు తెలియజేసే విధంగా అన్ని వివరాలతో కూడిన అన్ని అంశాలు తెలియజేయాలని అధికారులను కోరాం. ఆరు గ్యారంటీలకు సంబంధించి మంత్రివర్గ భేటీలో సుదీర్ఘంగా చర్చించాం. ప్రతి గ్యారంటీ విషయంలో సుదీర్ఘంగా చర్చ జరుగుతుంది. అందులో భాగంగా తొలుత రెండు గ్యారంటీలను అమలు చేయాలని నిర్ణయించాం. శుక్రవారం ఆయా శాఖల అధికారులతో చర్చించి 9వ తేదీన వాటిని అమలు చేసే కార్యక్రమం చేపడతాం. దీనికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

**డిసెంబరు 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు :** రాష్ట్రంలో పరిశ్రమలకు ఇబ్బంది లేకుండా, సాగుకు 24 గంటల కరెంటు ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో సమీక్షిస్తారు. గత తొమ్మిదేళ్లుగా విద్యుత్‌కు సంబంధించి ప్రణాళికా బద్ధంగా వ్యవహరించలేదు. గత ప్రభుత్వం అనేక తప్పిదాలకు పాల్పడింది. గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌పై సమీక్షించాం. డిసెంబరు 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయి. 9న కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం, ప్రొటెం స్పీకర్ ఎన్నిక ఉంటుంది. ప్రొటెం స్పీకర్‌ను గవర్నర్ నియమించిన తర్వాత ... వారి చేతుల మీదుగా ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం ఉంటుంది. ఆ తర్వాత స్పీకర్ ఎన్నిక, గవర్నర్ ప్రసంగం ఉంటుంది. తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలను ఆయా జిల్లాలకు సంబంధించిన మంత్రులు పరిశీలిస్తారు. రైతులకు పెట్టుబడి సాయంపై కేబినెట్‌లో చర్చించాం. అన్ని వివరాలు ఇవ్వాలని ఆర్థికశాఖ అధికారులను ఆదేశించాం. మంత్రులకు శాఖల కేటాయింపుపై సీఎం, పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది" అని శ్రీధర్‌బాబు వెల్లడించారు. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల విషయమై కేబినెట్‌లో చర్చించామని, అధికారుల నుంచి పూర్తి వివరాలు అందాక నిర్ణయం తీసుకుంటామని మరో మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని సీఎస్ ప్రారంభిస్తారని చెప్పారు.




# మాట నిలబెట్టుకున్న రేవంత్.. కొలువుల జాతర మొదలైంది

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ప్రమాణాన్ని నిలబెట్టుకున్నారు. ఎన్నికల ముందు గాంధీభవన్ సాక్షిగా ఓ దివ్యాంగురాలు రజనీకి ఇచ్చిన హామీని అమలు చేశారు. ఎల్బీ స్టేడియంలో సీఎంగా బాధ్యతలు చేపట్టగానే లక్షలాది ప్రజల సాక్షిగా రజనీకి ఉద్యోగం ఇస్తూ రేవంత్‌రెడ్డి తన హామీని నెరవేర్చారు. స్టేజీపైనే రజనీకి ఉద్యోగ పత్రాలను అందజేశారు. ముందుగా ఆరు గ్యారెంటీలపై రేవంత్‌రెడ్డి తొలి సంతకం చేయగా... అనంతరం రజనీకి ప్రభుత్వోద్యోగం ఇస్తూ రెండో సంతకం చేశారు.

**రజనీ బ్యాక్‌గ్రౌండ్ ఇదే..** నాంపల్లి నియోజకవర్గం బోయిగూడ కమాన్ ప్రాంతానికి చెందిన రజనీ అక్టోబరు 17న గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డిని కలిశారు. దివ్యాంగురాలిని కావడంతో తనకు ఉద్యోగం లభించడం లేదని, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని, ఉద్యోగం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. రజినీ, ఆమె కుటుంబసభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్న రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీల కార్డును సంతకం చేసి ఇచ్చారు. తాను సీఎం అయ్యాక తొలి ఉద్యోగం రజనీకే ఇస్తానని హామీ ఇచ్చారు. మొత్తానికి రేవంత్ ఇచ్చిన హామీను అక్షరాల నిజం చేసి చూపించారు. తెలంగాణ నిరుద్యోగులకు ఒక భరోసాను ఇచ్చారు. ఈ పరిణామాలను ప్రశంసిస్తూ రేవంత్‌కు ప్రజలు జేజేలు కొడుతున్నారు. పీజీ పూర్తై 11 సంవత్సరాల తర్వాత రజనీకి ఉద్యోగం లభించింది. ఉద్యోగం రావడంపై ఆమె సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కొత్త ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది.

# రేవంత్‌కి శుభాకాంక్షలు తెలిపిన మోదీ.. ఆయన ఏమన్నారంటే?



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎనుముల రేవంత్ రెడ్డి కి ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి తాము సహకరిస్తామని వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై తొలి సంతకం చేశారు. రెండవ సంతకం దివ్యాంగురాలు రజనీ ఉద్యోగ నియామకం పత్రంపై చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డికి సెలబ్రిటీల శుభాకాంక్షలు

తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డికి టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ట్విట్టర్ వేదికగా పోస్ట్ చేశారు. 'తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టిన రేవంతరెడ్డి గారికి శుభాకాంక్షలు. మీ నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాం" అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. అలాగే డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన భట్టి విక్రమార్కకు కూడా చిరు శుభాకాంక్షలు తెలిపారు.

తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపిన మొదటి వ్యక్తి చిరంజీవే! ప్రస్తుతం ఆయన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గురువారం ఎల్ బి స్టేడియంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై రేవంత్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. రేవంత్‌తో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రేవంత్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. సీఎంగా




రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రమాణస్వీకారం తరువాత వరుసగా మంత్రులతో గవర్నర్ తమిళిసై ప్రమాణం చేయించారు. ముందుగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనరసింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు ఇలా వరుసగా ప్రమాణ స్వీకారం చేశారు.

# ఏఐసీసీ అగ్ర నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల భేటీ

హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి గురువారం నాడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తదితర ముఖ్య నేతలు వచ్చారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఏఐసీసీ అగ్ర నేతలు తిరిగి తాజ్ కృష్ణ హోటల్‌కి చేరుకున్నారు. వీరితో పాటు సీఎం రేవంత్‌రెడ్డి , తన కేబినేట్ మంత్రులు హోటల్‌కి వచ్చారు. సోనియా , రాహుల్, ప్రియాంక, ఖర్గేలతో రేవంత్‌రెడ్డి, మంత్రులు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో కీలక అంశాలపై మరోసారి చర్చించినట్లు తెలుస్తోంది.

ఈ సమావేశం కొద్దిసేపటి క్రితమే ముగిసింది. ఈ సమావేశం ముగియడంతో సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గే మళ్లీ తిరిగి ఢిల్లీ వెళ్లనున్నారు. ఈమేరకు తాజ్ కృష్ణ హోటల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వీరు బయలు దేరి వెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ కీలక నేతలు శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లి ఏఐసీసీ అగ్ర నేతలకి వీడ్కోలు పలకనున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com